## ప్రజలకు ఇబ్బంది లేకుండా తాగునీరు అందించాలి




# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

## రైతులకు ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన సదస్సు




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 109 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- గురువారం 16 ఏప్రిల్ 2026


## విషాదం..డిటోనేటర్లు పేలి నలుగురు దుర్మరణం..

**మరో 12 మంది పరిస్థితి విషమం**



**అమరావతి ఏప్రిల్ 15(పిసీడబ్ల్యూ న్యూస్):** ఏపీలో విషాదం చోటు చేసుకుంది. ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలి నలుగురు మృత్యువాత పడ్డారు. సత్యసాయి జిల్లా కదిరి మండలం కుమ్మరవార్ల గ్రామంలో బుధవారం ఓ ఇంట్లో నిలువ ఉంచుకున్న రాళ్లు బద్దలు చేసే మిగతా2లో...

## కాల్పుల విరమణ గడవు పొడిగించే ఛాన్స్ లేదు



- శాశ్వతమైన ఒప్పందం వైపే మొగ్గు చూపుతున్నాం
- ట్రంప్ మరోమారు కీలక వ్యాఖ్యలు

**వాషింగ్టన్,ఏప్రిల్ 15(పిసీడబ్ల్యూ న్యూస్):** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో కొనసాగుతున్న కాల్పుల విరమణను మిగతా2లో...

## తెలంగాలో భగ్గుమంటున్న భానుడు

**- పలు ప్రాంతాల్లో 43 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు**



**హైదరాబాద్,15(పిసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. మధ్యాహ్నమైతే చాలు భానుడు భగ్గుమంటున్నాడు. దాంతో వాతావరణ కేంద్రం హైదరాబాద్ మిగతా2లో...

# 'కుల కార్పొరేషన్ల' భర్తీకి గ్రీన్ సిగ్నల్



● ఒకట్రెండు రోజుల్లో జీవో ● మీనాక్షి నటరాజన్‌తో భేటీలో సీఎం నిర్ణయం

పీఏసీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలంటూ పీసీసీ చీఫ్‌నకు విజ్ఞప్తి

**హైదరాబాద్,ఏప్రిల్ 15(పిసీడబ్ల్యూ న్యూస్):** అధికార పార్టీలోని ఆశావహులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న కార్పొరేషన్ చైర్మెన్లు, పాలక మండళ్లకు సంబంధించిన పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు ఒకట్రెండు రోజుల్లో విడుదల కానున్నాయి. కాకపోతే ప్రస్తుతానికి నాయిబ్రాహ్మణ, పద్మశాలి, రజక తదితర కులాలకు చెందిన కార్పొరేషన్లలోని పోస్టులనే భర్తీ చేయనున్నారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో మిగతా2లో...

# టిడిపి కార్యనిర్వాహక అధ్యక్షుడిగా లోకేశ్

● పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా కొనసాగింపు

● ఇద్దరు క్షేత్రస్థాయి నేతలకు పోలిట్ బ్యూరోలో స్థానం

● పార్టీ కార్యవర్గాన్ని పునర్నిర్మించిన చంద్రబాబు



**అమరావతి,ఏప్రిల్ 15(పిసీడబ్ల్యూ న్యూస్):** టిడిపి కీలక నిర్ణయం తీసుకుంది. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మంత్రి నారా లోకేశ్‌ను ప్రకటించింది. పార్టీకి ఇప్పటి వరకు జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న లోకేశ్‌ఓ రకంగా ప్రమోషన్ పొందారు. మెల్లగా ఆయన చంద్రబాబుకు ప్రత్యామ్నాయంగా ఎదుగుతున్నారు. ఇప్పటికే పార్టీలో అంతా తానై నడిపిస్తున్నారు. ఇకపోతే తెదేపా ఏపీ అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాస్ కొనసాగనున్నారు. పొలిటిబ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీలను ఈ మేరకు పార్టీ ప్రకటించింది. తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శులుగా రామ్మోహన్ నాయుడు, బైరెడ్డి శబరి, రాజేశ్ కిలార్‌లను పార్టీ నియమించింది. సీనియర్లకు గౌరవమిస్తూ.. కొత్తవారికి అవకాశాలు కల్పిస్తూ.. సామాజిక కోణంలో నూతన కమిటీల కూర్పు జరిగింది. విధేయత, కష్టపడే తత్వం, అనుభవం లెక్కించి అధిష్ఠానం పదవులు ఇచ్చింది. నామినేటెడ్ పదవుల్లో అవకాశాలు రాని వారికి మిగతా2లో...

# నేటినుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు

● మహిళా బిల్లు, డీలిమిటేషన్‌పై చర్చ ● ప్రభుత్వ తీరుపై విపక్షాల అసహనం ● వాడీవేడీగా సాగనున్న సమావేశాలు



**న్యూఢిల్లీ,ఏప్రిల్ 15(పిసీడబ్ల్యూ న్యూస్):** పార్లమెంట్ మరో చారిత్రక నిర్ణయానికి వేదిక కాబోతున్నది. మహిళా బిల్లు, డీ లిమిటేషన్ బిల్లు ఆమోదం కోసం ఉభయ సభలు గురువారం నుంచి మూడ్రోజులు సమావేశం కాబోతున్నాయి. మహిళా బిల్లును ఇప్పటికే ఆమోదంచారు. 2026 జనాభా లెక్కల మేరకు సీట్లు కేటాయిస్తామని ప్రకటించారు. అయితే ఇప్పుడు 2011 జనాభా లెక్కల మేరకే దీనిని మోదించే అవకాశం కనిపిస్తోంది. ఈ క్రమంలో పార్లమెంట్ ఉభయ సభలు వాడీవేడిగా సాగే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న బిల్లు స్వరూపాన్ని విపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి. అందువల్ల నేటి నుంచి సాగే సమావేశాలపై ఉత్కంఠత కొరసాగుతోంది. ఉభయ సభల్లోనూ బిల్లుల ఆవశ్యకతపై ప్రధాని మోడీ మాట్లాడుతారు. ఇప్పటికే కాంగ్రెస్ తన మిగతా2లో...

## పరిగిలో ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో భూసేకరణ




**ఆందోళనకు దిగిన జాగృతి అధ్యక్షురాలు కవిత**

**వికారాబాద్,ఏప్రిల్ 15(పిసీడబ్ల్యూ న్యూస్):** వికారాబాద్‌లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితను పోలీసులు అరెస్టు చేశారు. పరిగిలో ఇండస్ట్రియల్‌కారిడార్ కోసం రైతుల భూములను బలవంతంగా సేకరిస్తున్నారని ఆరోపిస్తూ ఉదయం నుంచి కవిత ఆందోళన చేశారు. ఈ క్రమంలోనే రైతులతో కలిసి వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ప్రభుత్వం పారిశ్రామికీకరణ ముసుగులో మిగతా2లో...

## డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తాం

- మహిళా రిజర్వేషన్ బిల్లుకు తాము అనుకూలం
- కేంద్రం తీసుకొస్తున్న విధానం సరికాదు
- ప్రతిపక్ష 'ఇండియా బ్లాక్' పార్టీలు స్పష్టం




# మార్కెట్ యార్డ్‌ల అభివృద్ధికి కట్టుదిట్టమైన చర్యలు

యార్డుల్లో 'జీరో బిజినెస్' అంశంపై మంత్రి ఆగ్రహం

మార్కెట్ యార్డుల్లో 'జీరో బిజినెస్' అంశంపై మం

రెండేళ్లలో మొత్తం రూ.568.50 కోట్ల వ్యయం

లైసెన్సులు కొనసాగిస్తున్న ట్రేడర్లపై కఠిన చర్యలు

మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ అధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష



**హైదరాబాద్,ఏప్రిల్ 15(పిసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ల అభివృద్ధి, పారదర్శకతపై కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ అధికారులతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. మార్కెట్ యార్డ్‌ల అభివృద్ధి పనుల పురోగతి, రైతులకు అందుతున్న సౌకర్యాలపై ఆయన అధికారులతో చర్చించారు. గత రెండు సంవత్సరాల్లో మొత్తం రూ.568.50 కోట్ల వ్యయంతో 630 అభివృద్ధి పనులు మంజూరు చేసినట్లు మంత్రికి అధికారులు వెల్లడించారు. ఇందులో రూ.128 కోట్లతో 113 పనులు పూర్తయ్యాయని నివేదిక సమర్పించారు. మిగిలిన పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. ప్రతి పనికి టైమ్‌లైన్ నిర్ణయించి వేగంగా ముందుకు తీసుకెళ్లాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. మార్కెట్ యార్డుల్లో 'జీరో బిజినెస్' అంశంపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యాపారం చేయకుండా లైసెన్సులు కొనసాగిస్తున్న ట్రేడర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, వారి లైసెన్సులను రద్దు చేయాలని ఆదేశించారు. అలాంటి వారికి సహకరించే అధికారులపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. అభివృద్ధి పనుల పర్యవేక్షణ కోసం ప్రత్యేక డ్యాష్‌బోర్డ్ ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, పంట ఉత్పత్తుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు తుమ్మల. గడ్డిఅన్నారం మార్కెట్‌లో 'స్మార్ట్ మార్కెట్ యార్డ్' అమలు చేయాలని, డిజిటలైజేషన్ ద్వారా జీరో బిజినెస్ సమస్యను తగ్గించాలని నిర్ణయించారు. కోహెడ మార్కెట్ అభివృద్ధి పనులకు మిగతా2లో...

## దక్షిణాదికి అన్యాయం చేస్తే పెను ఉద్యమం

మహిళా రిజర్వేషన్లకు సంపూర్ణ మద్దతు

నియోజకవర్గాల పునర్విభజనతో ముడి పెట్టడానికి వ్యతిరేకం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్,ఏప్రిల్ 15(పిసీడబ్ల్యూ న్యూస్):** నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) పేరుతో దక్షిణాదికి ప్రాతినిధ్యం తగ్గేలా అన్యాయం చేస్తే పెను ఉద్యమం తప్పదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) కేంద్ర ప్రభు త్వాన్ని హెచ్చరించారు. బుధవారం ఆయన ఎక్స్ ద్వారా ట్వీట్ చేశారు. దక్షిణాదికి ప్రాతినిధ్యం తగ్గితే అది కేవలం రాజకీయ ప్రక్రియగానో లేక చట్ట సవరణ గానో మిగిలిపోదనీ, మొత్తం దక్షిణ భారతదేశం మిగతా2లో...




## పునర్విభజన జనాభా ప్రకారమే...

రాజ్యాంగం నిర్దేశించింది కూడా ఇదే

సిఎం రేవంత్ గందరగోళ వ్యాఖ్యలు తగవు

బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

**వరంగల్,ఏప్రిల్ 15(పిసీడబ్ల్యూ న్యూస్):** నియోజకవర్గాల పునర్విభజన అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కావాలనే అసత్య ప్రచారానికి తెరలేపారని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు విమర్శించారు. బుధవారం వరంగల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. నియోజకవర్గాల పునర్విభజన అనేది రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ అని రాంచందర్‌రావు స్పష్టం చేశారు. సీట్ల పెంపు అనేది 2011 మిగతా2లో...

# రైతులకు ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన సదస్సు




**పంట మార్పిడి,ప్రత్యామ్నాయ పంటల సాగుతో రైతులకు లాభాదాయకం**

**ఆత్మ కమిటీ చైర్మన్నల్లు సుధాకర్ రెడ్డి**

**కురవి ఏప్రిల్15(పి.సి.డబ్ల్యూ న్యూస్):** పంట మార్పిడి, ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టడంతోనే రైతులకు వ్యవసాయం లాబా సాటిగా మారుతుందని ఆత్మ కమిటీ చైర్మన్ నల్ల సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారుకురవి మండల కేంద్రంలోని వ్యవసాయ క్షేత్రంలో రైతులకు ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన సదస్సును ఉద్యానవన వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆత్మ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ రైతులందరూ ఒకే పంట నిరంతరం సాగు చేయడం వలన భూసారం తగ్గిపోవడం, పంటకు డిమాండ్ తగ్గి రైతులకు నష్టాలు రావడం జరుగుతుందని కాబట్టి ప్రతి రైతు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని దానిలో భాగంగా ఆయిల్ ఫామ్ సాగు ఎక్కువ విస్తీర్ణంలో ఆధునిక పద్ధతులతో రైతాంగం సాగు చేసి, ప్రభుత్వము నుండి వచ్చే అనేక రాయితీలను పొందాలని కోరారు అదేవిధంగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన భూసార పరీక్షలను ప్రతి రైతు ఉపయోగించుకోవాలనీ కోరారు కెవికే మల్యాల శాస్త్రవేత్తలు ప్రశాంత్, సుహాసి ని లు రైతులకు సాగులో మెలకువలు గురించి వివరించారు ఉద్యానవన జిల్లాఅధికారి మరియన్న మాట్లాడుతూ ఉద్యానవన సాగుతూనే రైతులకు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు సాధించవచ్చునని అన్నారు.ఆయిల్ ఫామ్ సాగు డైరీ కరపత్రాలను ఆవిష్కరించారుఆయిల్ ఫాం సాగు చేసిన ఆదర్శ రైతులు వెంకట్ రెడ్డి, ప్రతాపని పుల్లయ్య, రామ్ రెడ్డి, సత్యనారాయణ లను చైర్మన్, అధికారులు ఘనంగా సన్మానించారుఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు నరసింహారావు, శాంతి ప్రియ, రాజేశ్వరి రైతులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీని సద్వినియోగం చేసుకోండి: సర్పంచ్ సొల్లు అజయ్ వర్మ



**కరీంనగర్ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 15(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం గునుకుల కొండాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గన్నేరువరం ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి స్థానిక సర్పంచ్ సొల్లు అజయ్ వర్మతో కలిసి పటేల్ చెరువులోకి వచ్చే ఫీడర్ కాలువ పనులు ప్రారంభోత్సవం చేశారు. సర్పంచ్ సొల్లు అజయ్ వర్మ మాట్లాడుతూ నిరుపేదలకు ఈ పథకం ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని, జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబం ఈ పథకాన్ని వినియోగించుకోవాలని, వాటితో పాటు ఆర్థిక పరిస్థితులను మెరుగుపరుచుకోవచ్చని తెలిపారు. ఈ ఫీడర్ కాలువ పనికి 7 లక్షల రూపాయలు మంజూరు ఇప్పించడం జరిగిందని ఎంపీడీవో తెలిపారు.ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ సంపత్, ఫీల్డ్ అసిస్టెంట్ హన్మాండ్ల యాదగిరి, పాలకమండలి సభ్యులు కొరివి నాగవ్వ, హనుమాన్ల పద్మ, బూట్ల శ్రీలత, చొక్కల సంగీత, చొక్కల లక్ష్మయ్య, మేట్స్ ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణాలో కరీంనగర్ రోల్ మోడల్గా నిలవాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా






**కరీంనగర్ జిల్లా ప్రతినిధి,ఏప్రిల్15(పి.సి.డబ్ల్యూ న్యూస్):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సమావేశాలు పకడ్బందీగా నిర్వహించాలి.. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా జిల్లాలో నిర్వహించనున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సమావేశాలను అత్యంత పకడ్బందీగా, ప్రజా పాలన ప్రతిబింబించేలా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. ఈ సమావేశాలు చారిత్రాత్మకంగా నిలిచేలా సమర్థవంతంగా నిర్వహించాలని ఆమె సూచించారు. ఈ నెల 16వ తేదీ గురువారం మండల స్థాయిలో జరిగే సమావేశాల నేపథ్యంలో బుధవారం సాయంత్రం జిల్లా స్థాయి అధికారులతో పాటు ఎంపీడీవోలు, ఎంఈఓలు, ఎంపీవోలతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల స్థాయి సమావేశాలను విజయవంతం చేయడానికి పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. సంక్షేమ పథకాల వారీగా లబ్ధిదారుల వివరాలను వెల్లడించాలని సూచించారు. రైతు భరోసా, రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, మహిళలకు రుణాలు, కార్పొరేషన్ల ద్వారా అందించిన రుణాలు, మహాలక్ష్మి పథకం, సన్నబియ్యం పంపిణీ వంటి అంశాలపై ప్రత్యేకంగా వివరించాలన్నారు. మండలాల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. విద్య, వైద్యం, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమం, రైతు సంక్షేమం వంటి రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని, అందరూ సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని తెలిపారు. అదేవిధంగా, రోడ్డు భద్రతపై రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములు చేయాలని, ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంపొందించాలని సూచించారు. జిల్లాను రాష్ట్రంలో ఆదర్శంగా నిలబెట్టే విధంగా సమావేశాలను నిర్వహించేందుకు అధికారులు కృషి చేయాలని, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, డీపీఓ జగదీశ్వర్, ఇన్‌చార్జి సీపీఓ రామ్ దత్తారెడ్డి, డీఎంహెచ్వో వెంకటరమణ, జెడ్పీ సీఈఓ శ్రీనివాస్, డీఎస్ఓ నర్సింగరావు, డీఆర్డీఓ శ్రీధర్, సంక్షేమ అధికారి సరస్వతి, హౌసింగ్ పీడీ శ్రీనివాస్ తదితర అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు సేవలందించడమే ఆలయ ఫౌండేషన్ లక్ష్యం



**కరీంనగర్ జిల్లా ప్రతినిధి తిమ్మాపూర్ ఏప్రిల్ 15 (పీసీడబ్ల్యూ న్యూస్):** ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఫౌండేషన్ సభ్యులు తీట్ల రమేష్ మాట్లాడుతూ పేద ప్రజలకు అవసరమైన విద్య, వైద్య సదుపాయాలకు సంబంధించిన సేవలందించడమే ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి మార్గదర్శనం లో నడుస్తున్న ఆలయ ఫౌండేషన్ లక్ష్యమని ఉమ్మడి కరీంనగర్ జిల్లా సభ్యులు తీట్ల రమేష్ బాబు పేర్కొన్నారు.తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెం గ్రామానికి చెందిన నక్క మొండయ్య భార్య లక్ష్మి కి గతంలో అనారోగ్యం వల్ల శస్త్ర చికిత్స ద్వారా మోకాలు పై వరకు తొలగించారు. ఆలయ ఫౌండేషన్ సిఈఓ కీర్తి నాగార్జున ద్వారా హైదరాబాద్ కు వెళ్లిన లక్ష్మికి ఇటీవల కృత్రిమ కాలు అమర్చడం జరిగింది.బుధవారం మొగిలిపాలెం వచ్చిన సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కంటి పరీక్షలు,శస్త్ర చికిత్సల కోసం నరహరి బసంత్ నగర్ లో పెద్ద ఆసుపత్రి కట్టించినట్లు తెలిపారు. ఉన్నత చదువులతో పాటుగా ఉపాధి కల్పన లో పెద్ద, పెద్ద కార్పొరేటు కంపెనీ ల ద్వారా ఉద్యోగ అవకాశాలకోసం క్యాంప్ లు కూడా ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.కృత్రిమ కాలు అమర్చడం కోసంభాధితుల పక్షాన ఫౌండేషన్ ను సంప్రదించిన మాజీ వైస్ ఎంపిపి తుమ్మనపల్లి శ్రీనివాసరావ్,న్యాయవాది బీజేపీ మాజీ మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి లకు ధన్యవాదములు తెలిపారు. సర్పంచ్ తాట్ల తిరుపతి,కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు మోరపల్లి రమణారెడ్డి,వార్డు సభ్యులు చెన్నబోయిన రవి,పాశం రాఘవరెడ్డి, ఎల్కపల్లి స్వామి, జక్కుల శ్రీనివాస్, జనార్ధన్ రావు,రవికుమార్, వరుణ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మండల సభలకు పకడ్బందీ ఏర్పాట్లు: జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.




**ములుగు ప్రతినిధి ఏప్రిల్ 15(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 16న మండల కేంద్రాలు, మున్సిపాల్టీలో నిర్వహించనున్న సభలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. బుదవారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు పలు సూచనలు చేశారు. ముందస్తుగానే సభా వేదికలను సందర్శించి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించాలని మండల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓలు, తహసీల్దార్లతో, ఇతర మండల స్థాయి అన్ని శాఖల అధికారులతో సమావేశమై తగు సూచనలు చేయాలన్నారు. సభలు నిర్వహించే ప్రదేశాలలో తగిన నీడ, తాగునీరు వంటి కనీస వసతులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు మంజూరు, నూతన రేషన్ కార్డుల పంపిణీ,సన్న బియ్యం పంపిణీ, గృహలక్ష్మి, మహాలక్ష్మి, ఇందిరా మహిళా శక్తి పథకం,కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్, సన్న వడ్ల బోనస్,ఇతర సంక్షేమ పథకాల గురించి సభలలో అవగాహన కల్పించడంతో పాటు,ఆయా పథకాల ద్వారా ప్రయోజనం పొందుతున్న లబ్దిదారుల వివరాలు చదివి వినిపించాలని, లబ్ధిదారులతో వారి అనుభవాలను ప్రజలకు తెలియజేసేలా చూడాలన్నారు. రేషన్ కార్డులు, పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వంటి వాటికి సంబంధించి గ్రామ సభలలో వచ్చిన అర్జీలను మండల సభలకు ముందు తప్పనిసరిగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సభలకు ప్రజాప్రతినిధులను తప్పనిసరిగా ఆహ్వానించాలని, అందరూ భాగస్వాములు అయ్యేలా చొరవ చూపాలన్నారు. సభ ప్రారంభ సమయంలో ప్రోటోకాల్ ప్రకారం ముందుగా రాష్ట్ర గేయం, ముఖ్యమంత్రి సందేశం అందరికీ వినిపించాలన్నారు.రోడ్డు ప్రమాదాలపై అవగాహన పెంపొందించేందుకు ఉద్దేశించిన అరైవ్-అలైవ్ కార్యక్రమం గురించి సభల్లో తెలియజేయాలని అన్నారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సభల విజయవంతానికి అంకిత భావంతో కృషి చేయాలన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్ లో జిల్లా అదనపు కలెక్టర్లు రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, స్థానిక సంస్థలు సంపత్ రావు,జిల్లా పౌరసరఫరాల మేనేజర్, జిల్లా వ్యవసాయ అధికారి, నీటి పారుదల శాఖ ఈఈలు, విద్యుత్ శాఖ అధికారులు, హౌసింగ్ పీడీ, జిల్లా ఉద్యానవన అధికారి, సి.పి.ఓ, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి, ఆర్.డబ్ల్యూ.ఎస్ ఈఈ, డి.పి.ఓ. సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ జిల్లా అక్రిడిటేషన్ కమిటీ నియామకంలో అవకతవకలు

- **అక్రిడిటేషన్ కమిటీని తక్షణమే రద్దు చేయాలి**
- **డిపిఆర్ఓ పై సమాచార కమిషనర్‌కు ఫిర్యాదు**

**మేడ్చల్మల్కాజ్గిరి జిల్లా , ఏప్రిల్ 15(పీసీడబ్ల్యూ న్యూస్):**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అక్రిడిటేషన్ కమిటీలో అవకతవకలు జరిగాయని జిల్లాలోని పలువురు సీనియర్ జర్నలిస్టులు బుధవారం జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి కి ఫిర్యాదు చేశారు. సమాచార పౌర సంబంధాల శాఖ జారీ చేసిన ఉత్తర్వులకు విరుద్ధంగా జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారిని కమిటీని నియమించారని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ముఖ్యంగా ఒకే యూనియన్ కు పెద్దపీట వేయడంతో పాటు జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారిని తనకు అనుకూలంగా ఉన్నవారిని కమిటీలో నియమించారని సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్లినట్లు వారు పేర్కొన్నారు. జిల్లా అక్రిడిటేషన్ కమిటీ నియామకంపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ విషయంలో ఇప్పటికే సమాచార హక్కు చట్టం కింద అక్రిడిటేషన్ కమిటీ నియామకంపై పూర్తి సమాచారం ఇవ్వాలని జిల్లా పౌర సంబంధాల అధికారిని కోరినట్లు వారు తెలిపారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు వారు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా నియమించిన జిల్లా అక్రిడిటేషన్ కమిటీని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

# ప్రజలకు ఇబ్బంది లేకుండా త్రాగునీరు అందించాలి

**సమ్మర్ త్రాగునీటి సరఫరా యాక్షన్ ప్లాన్ ప్రకారం పకడ్ బందీగా చర్యలు తీసుకోవాలి**

**జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్.**



**మహబూబాబాద్ జిల్లా ఏప్రిల్15(పి.సి.డబ్ల్యూ న్యూస్):** బుధవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్ అధ్యక్షతన సమ్మర్ త్రాగునీటి యాక్షన్ ప్లాన్, కనీస వేతనాల అమలు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి కాలం నేపథ్యంలో జిల్లాలోని ప్రతి ఇంటికి త్రాగునీరు అందించడంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు యాక్షన్ ప్లాన్ ప్రకారం జిల్లాలోని హ్యాబిటేషన్లను హ్యాండ్ పంపులు సంపులు తదితర త్రాగునీరు అందించే సదుపాయాలను సిద్ధం చేసుకోవాలని మిషన్ భగీరథ, ఇంట్ర, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖ, గ్రామపంచాయతీ, జిల్లా ప్రజా పరిషత్, మున్సిపల్ తదితర ఇంజనీరింగ్ విభాగం త్రాగునీటి సరఫరాలో సమన్వయంతో కలిసి పని చేయాలని, సమస్యలు ఉన్నచోట ప్రత్యేక శ్రద్ధ వహించాలని గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని సిద్ధంగా ఉండాలని, అవసరం అయితే వాటర్ ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేయాలని సూచించారు.రేపు నిర్వహించబోయే మండల సభలో గ్రామస్థాయి మండల స్థాయి అధికారులు వాటర్ సప్లై సిబ్బంది పాల్గొనాలని ఆదేశించారు.పట్టణంలోని ప్రధాన విద్యాసంస్థలు, ఆస్పత్రులు కాలేజీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్రాగునీరును అందించాలని మున్సిపల్ శాఖ ఇంజనీరింగ్ మిషన్ భగీరథ సిబ్బందిని ఆదేశించారు,గ్రామపంచాయతీలు, మున్సిపల్ పరిధిలలో ఏవైనా తాగునీటి సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, స్థానిక వనరుల మేరకు త్రాగునీటిని అందించాలని, ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సంబంధిత సిబ్బందిపై శాఖపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు,జిల్లాలో వివిధ విభాగాలు ట్రైబల్ వెల్ఫేర్, ఎస్సీ, బిసి, అంగన్వాడి, ఇరిగేషన్, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం, మున్సిపల్, తదితర డిపార్ట్మెంట్లో పనిచేస్తున్న ఎన్ఎంఆర్ సిబ్బందికి ప్రభుత్వ, జిఓ, రూల్స్, సూచనల మేరకు వేతనాలు అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

## రోడ్డు ప్రమాదంలో కాంగ్రెస్ నేత జావేద్ మృతి

**- తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసిన ఎంపీ రఘురాం రెడ్డి**



**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం నగర కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు, పీసీసీ సభ్యులు మహమ్మద్ జావేద్ బుధవారం సూర్యాపేట జిల్లా పిల్లలమర్రి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారన్న విషయం తెలుసుకొని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మైనార్టీ నేతగా, కాంగ్రెస్ పార్టీలో నిబద్ధత కలిగిన నాయకుడిగా పనిచేసిన మంచి వ్యక్తిని కోల్పోవడం చాలా బాధాకరమని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జావేద్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ.., ఈ తీరని దుఃఖాన్ని తట్టుకునే శక్తి వారికి ప్రసాదించాలని, తన ప్రగాఢ సంతాపం తెలిపారు.

## అమర్నాథ్ యాత్రికులకు కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో హెల్త్ సర్టిఫికెట్

**కరీంనగర్ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 15(పీసీడబ్ల్యూ న్యూస్):** అమర్నాథ్ యాత్ర-2026కు సంబంధించి యాత్రకు వెళ్ళ దలిచే భక్తులు తప్పనిసరి ఆరోగ్య ధృవీకరణ పత్రం (compulsory health certificate `CHC)ని కరీంనగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పొందవచ్చని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ యాత్రకు వెళ్లాలనుకునే భక్తులకు ఈ సర్టిఫికెట్ తప్పనిసరి అని, కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలోని ప్రత్యేక వైద్యుల ఆధ్వర్యంలో యాత్రికులకు పరీక్షలు నిర్వహించి ఆరోగ్య ధృవీకరణ పత్రం అందజేస్తామని తెలిపారు.

## కల్లూరులో ప్రజా పాలన ప్రగతి సమావేశానికి ఆహ్వానం



**కల్లూరు, ఏప్రిల్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మండలంలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 16న గురువారం ఉదయం ముఖ్య సమావేశం నిర్వహించ బడుతుందని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం 11 గంటలకు కల్లూరు రైతు వేదికలో మండల స్థాయి కార్యక్రమం జరగనుంది. ఈ సమావేశంలో ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, అలాగే త్వరలో ప్రవేశపెట్టబోయే కొత్త పథకాలపై అధికారులు, ప్రజాప్రతినిధులు చర్చించనున్నారు. గ్రామాల అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారం, సంక్షేమ కార్యక్రమాల అమలు పై సమీక్ష కూడా జరగనుంది. ఈ కార్యక్రమానికి సర్పంచులు, గ్రామ పంచాయతీ సభ్యులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆహ్వానించారు. ప్రజా పాలనను గ్రామ స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో ఈ సమావేశం కీలకంగా మారనుంది.

## ములుగు జిల్లాలో గౌడ సమాజ అభివృద్ధిపై రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్ గౌడ్‌తో చర్చలు....



**మల్లంపల్లి మండల ప్రతినిధి ఏప్రిల్ 15 (పీసీడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్ గౌడ్ గారిని మర్యాదపూర్వకంగా కలిసి పలు ముఖ్య అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లాలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం ఏర్పాటు అత్యవసరమని పేర్కొన్నారు. గౌడ సమాజ గౌరవానికి ప్రతీకగా నిలిచేలా ములుగు జిల్లాలో పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర అధ్యక్షులకు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా గౌడ సమాజానికి శాశ్వత గుర్తింపుగా నిలిచే విధంగా జిల్లాలో గౌడ భవనం నిర్మాణం చేపట్టాలని ప్రతిపాదించారు. అలాగే ఏజెన్సీ ప్రాంతాలలో నిలిచిపోయిన గౌడ సంఘాల సొసైటీలను పునరుద్ధరించడం అత్యవసరమని, అవి సమాజ అభివృద్ధికి కీలకమని వివరించారు. ఇంకా గౌడ వృత్తికి సంబంధించిన తాటి చెట్ల నుండి మద్యం సేకరణ (ఎక్స్ట్రాక్షన్) హక్కులు సక్రమంగా అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని, గౌడల జీవనోపాధికి అడ్డంకులు తొలగించాలని రాష్ట్ర అధ్యక్షులను కోరారు. ఈ అంశాలన్నింటిపై స్పందించిన రాష్ట్ర అధ్యక్షులు పల్లె లక్ష్మణ్ గౌడ్ గారు సమాజ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలకు పూర్తి మద్దతు ఇస్తామని తెలిపారు. అలాగే పాపన్న గౌడ్ విగ్రహం ఏర్పాటు, గౌడ భవనం నిర్మాణం, సొసైటీల పునరుద్ధరణ ఎక్స్ట్రాక్షన్ హక్కుల అంశాలపై త్వరలోనే స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు దిశగా ముందుకు తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ భేటీ గౌడ సమాజ హక్కులు, అభివృద్ధి కోసం కీలకమైన సమావేశంగా నాయకులు పేర్కొన్నారు.

## గంగాధరలో సేఫ్టీ అవగాహన పై విద్యార్థులతో మానవహారం




**గంగాధర ఏప్రిల్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలో ఈరోజు ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న "రోడ్ సేఫ్టీ అరైవ్ అలైవ్" కార్యక్రమంలో బాగంగా ఈరోజు గంగాధర మండలంలో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, ప్రజల్లో రోడ్డు భద్రతపై చైతన్యం పెంపొందించడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యంగా ఎస్ ఐ వంశీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా గంగాధర పోలీస్ స్టేషన్ ఎస్సై వంశీకృష్ణ ప్రధానంగా పాల్గొని, గంగాధరలోని వివేకానంద పాఠశాల విద్యార్థులతో కలిసి గంగాధర ఎక్స్ రోడ్ వద్ద మానవహారం (హ్యూమన్ చైన్) నిర్వహించడం జరిగింది. ఈ మానవహారం ద్వారా రోడ్డు నిబంధనలను పాటించడం ఎంత ముఖ్యమో, హెల్మెట్ ధారణ, సీట్ బెల్ట్ వినియోగం, మిత వేగం పాటించడం వంటి అంశాలపై ప్రజలకు స్పష్టమైన సందేశాన్ని అందించారు. అనంతరం వివేకానంద పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి, విద్యార్థుల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించేందుకు వివిధ పోటీలు నిర్వహించడం జరిగింది. వ్యాస రచన, చిత్రలేఖనం (డ్రాయింగ్), క్విజ్ పోటీలు విద్యార్థులలో మంచి స్పందనను రాబట్టాయి. ఈ పోటీల ద్వారా విద్యార్థులు రోడ్డు నిబంధనల ప్రాముఖ్యతను అర్థం చేసుకుని తమ ఆలోచనలను సృజనాత్మకంగా వ్యక్తపరిచారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన మొదటి ఐదు మంది విద్యార్థులకు ఎస్సై వంశీకృష్ణ స్వయంగా బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్ ఐ మాట్లాడుతూ, "రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత. చిన్నప్పటి నుంచే పిల్లల్లో సరైన అవగాహన కలిగిస్తే భవిష్యత్తులో ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చు" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు, సిబ్బంది, స్థానిక ప్రజలు, విద్యార్థులు,పోలీస్ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## హైదరాబాదు రవీంద్రభారతిలో ఘనంగా అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు.. దళితరత్న అవార్డుల ప్రదానం



**హైదరాబాద్, ప్రతినిధి ఏప్రిల్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్):** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారి 135వ జయంతి వేడుకలు రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన ప్రముఖ దళిత నాయకులు, సామాజిక సేవకులకు "దళితరత్న" అవార్డులు ప్రదానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ మాదిగ కుల దండోరా వ్యవస్థాపకులు జన్ను కనకరాజు మాదిగ, తెలంగాణ మాదిగ హక్కుల దండోరా డీఎంహెచ్డీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ ముఖ్యంగా పాల్గొని అవార్డు గ్రహీతలను సత్కరించారు. ఈ సందర్భంగా సామాజిక న్యాయం, హక్కుల సాధన, మరియు దళిత అభివృద్ధి కోసం విశేష కృషి చేసిన వ్యక్తులను గుర్తించి అవార్డులు అందజేశారు. **దళితరత్న అవార్డు గ్రహీతలు:** కనకపుడి వీరస్వామి మాదిగ (ఖమ్మం జిల్లా)బొడ్డు గురవయ్య (ఖమ్మం జిల్లా)మంద కుమార్ (భద్రాద్రి కొత్తగూడెం జిల్లా)పమ్మి రవి బహుజన యుద్ధనౌక (ఖమ్మం జిల్లా)కుక్కల రామకృష్ణ ఆర్కె (ఖమ్మం జిల్లా)పగిడి ముక్కుల విజయకుమార్ (ఖమ్మం జిల్లా)కాంపాటి ఉపేందర్ (ఖమ్మం జిల్లా)హెచ్ వెంకటేష్ (మహబూబాబాద్ జిల్లా)జినక రవీందర్ (మహబూబాబాద్ జిల్లా)వక్తలు మాట్లాడుతూ, అంబేద్కర్ ఆశయాలను సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, సమాజంలో సమానత్వం కోసం పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు.

## "పిల్లలకు కూడా హెల్మెట్ అవసరం ": ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్






**మహబూబాబాద్ జిల్లా ఏప్రిల్15 (పి.సి.డబ్ల్యూ న్యూస్):** పట్టణంలోని టౌన్ పోలీస్ స్టేషన్ నుండి అర్రైవ్ అలైవ్ 2026 కార్యక్రమంలో భాగంగా మూడవ రోజు రోడ్డు భద్రత పై అవగాహన బైక్ ర్యాలీ నిర్వహించారు . ఈ ర్యాలీలో తమ పిల్లలను పాఠశాలకు తీసుకెళ్లే తల్లిదండ్రులు, వారి పిల్లలు, ఉపాధ్యాయులు, అధికారులు, సిబ్బంది పాల్గొని రోడ్డు భద్రతపై ప్రజలలో చైతన్యం కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. శబరీష్, మాట్లాడుతూ, పిల్లల భద్రత ప్రతి తల్లిదండ్రి యొక్క ప్రథమ బాధ్యత అని తెలిపారు. చిన్న దూరం ప్రయాణం అయినా, "ఇప్పుడు అవసరం లేదు" అనే నిర్లక్ష్యం ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. ప్రమాదం ఎప్పుడు జరుగుతుందో చెప్పలేమని, హెల్మెట్ ఒక్కటే ప్రాణాలను రక్షించే ప్రధాన భద్రతా సాధనం అని పేర్కొన్నారు. పిల్లలను ముందుగా కూర్చోబెట్టి లేదా వెనుక కూర్చోబెట్టి ప్రయాణించే సమయంలో వారికి సరిపోయే సైజ్ హెల్మెట్ తప్పనిసరిగా పెట్టాలని సూచించారు. హెల్మెట్ సరైన విధంగా బిగించి పెట్టకపోతే ఉపయోగం ఉండదని, కాబట్టి సరిగ్గా ధరించడం కూడా అంతే ముఖ్యమని తెలిపారు. అలాగే, ఒక్క కుటుంబం మాత్రమే కాకుండా సమాజం మొత్తం ఈ నియమాన్ని పాటించాల్సిన అవసరం ఉందని చెప్పారు. పిల్లలు తమ తల్లిదండ్రులకు హెల్మెట్ ధరించమని గుర్తు చేయడం ద్వారా మంచి మార్పు తీసుకురాగలరని, రోడ్డు భద్రత కుటుంబ స్థాయి నుంచే ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. వేగ పరిమితులు పాటించడం, ట్రిపుల్ రైడింగ్ నివారించడం, ట్రాఫిక్ నియమాలను గౌరవించడం వంటి అంశాలు కూడా రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో కీలకమని వివరించారు. ప్రతి తల్లిదండ్రి తమకు మాత్రమే కాకుండా తమ పిల్లలకు కూడా హెల్మెట్ పెట్టి ప్రయాణించడం ద్వారా బాధ్యతాయుత పౌరులుగా నిలవాలని, ఇతరులకు ఆదర్శంగా ఉండాలని జిల్లా ఎస్పీ సూచించారు. రోడ్డు భద్రత అందరి బాధ్యత అని గుర్తుంచుకుని, హెల్మెట్ వినియోగాన్ని కచ్చితంగా పాటించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేసారు.

## రాష్ట్రస్థాయి పరీక్షా ఫలితాలలో రాణించిన హాసినికి సన్మానించిన భూపాల్ నాయక్ టీం



**మహబూబాబాద్ జిల్లా సిరోల్ ఏప్రిల్ 15(పి.సి.డబ్ల్యూ న్యూస్):** మండలం ఉప్పరగూడెం గ్రామానికి చెందిన అకోజూ శ్రీను, అనిత దంపతుల కూతురైన హాసిని ఖమ్మం ఎస్సార్ కాలేజీలో చదువుతూ ఇంటర్ ఫస్టియర్ లో రాష్ట్రంలో ఫస్ట్ ర్యాంక్ సాధించగా సెకండ్ ఇయర్ ఫలితాల్లో 991 మార్కులు సాధించి రాష్ట్రంలోనే తృతీయ స్థానం కనబరిచినందున ఉప్పరగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం సిరోల్ మండల కోఆర్డినేటర్ డి ఎస్ రామ్మూర్తి నాయక్ అధ్యక్షతన గ్రామ సర్పంచ్ మలికంటి సురేష్ ఆధ్వర్యంలో యువ దళపతి భూపాల్ నాయక్ టీం పుష్పగుచ్ఛం అందించి, మిఠాయి తినిపించి, శాలువాతో ఘనంగా సన్మానించారు... ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో గ్రామాలలో చెందిన విద్యార్థిని విద్యార్థులు వివిధ పాఠశాలల్లో వివిధ కాలేజీల్లో చదువుకుంటున్న వారందరూ హాసిని, నీ స్ఫూర్తి తీసుకొని చదవాలని మహబూబాబాద్ జిల్లాకి మంచి పేరు ప్రతిష్ట తీసుకురావాలని సూచించారు అదేవిధంగా ప్రతి ఒక్కరికి ఘనంగా సన్మానం చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో యువ దళపతి టీం సభ్యులు, డోర్నకల్ నియోజకవర్గ ఇన్చార్జ్ విష్ణు నాయక్ మరిపెడ ఎడెల్లి వెంకన్న డోర్నకల్ ఇంచార్జ్ శంకర్ నాయక్నరసింహుల పేట గణేష్, వై చిన్నగూడూరు శంకర్ నాయక్,ఉప సర్పంచ్ పంచాయతీ సెక్రెటరీ వార్డ్ సభ్యులు, అంగన్వాడీ టీచర్లు,ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు సేవలందించడమే ఆలయ ఫౌండేషన్ లక్ష్యం...!

**• ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఫౌండేషన్ సభ్యులు తీట్ల రమేష్**



**తిమ్మాపూర్,ఏప్రిల్15(పీసీడబ్ల్యూ న్యూస్):** పేద ప్రజలకు అవసరమైన విద్య, వైద్య సదుపాయాలకు సంబందించిన సేవలందించడమే ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి మార్గదర్శనం లో నడుస్తున్న ఆలయ ఫౌండేషన్ లక్ష్యమని ఉమ్మడి కరీంనగర్ జిల్లా సభ్యులు తీట్ల రమేష్ బాబు పేర్కొన్నారు. తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెం గ్రామానికి చెందిన నక్క మొండయ్య భార్య లక్ష్మి కి గతంలో అనారోగ్యం వల్ల శస్త్ర చికిత్స ద్వారా మోకాలు పై వరకు తొలగించారు. ఆలయ ఫౌండేషన్ సిఈఓ కీర్తి నాగార్జున ద్వారా హైదరాబాద్ కు వెళ్లిన లక్ష్మికి ఇటీవల కృత్రిమ కాలు అమర్చడం జరిగింది. బుధవారం మొగిలిపాలెం వచ్చిన సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కంటి పరీక్షలు, శస్త్ర చికిత్సల కోసం నరహరి బసంత్ నగర్ లో పెద్ద ఆసుపత్రి కట్టించినట్లు తెలిపారు. ఉన్నత చదువులతో పాటుగా ఉపాధి కల్పన లో పెద్ద, పెద్ద కార్పొరేటు కంపెనీ ల ద్వారా ఉద్యోగ అవకాశాలకోసం క్యాంప్ లు కూడా ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కృత్రిమ కాలు అమర్చడం కోసంభాధితుల పక్షాన ఫౌండేషన్ ను సంప్రదించిన మాజీ వైస్ ఎంపిపి తుమ్మనపల్లి శ్రీనివాసరావ్ మరియు న్యాయవాది బీజేపీ మాజీ మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి లకు ధన్యవాదములు తెలిపారు. సర్పంచ్ తాట్ల తిరుపతి,కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు మోరపల్లి రమణారెడ్డి,వార్డు సభ్యులు చెన్నబోయిన రవి,పాశం రాఘవరెడ్డి, ఎల్కపల్లి స్వామి, జక్కుల శ్రీనివాస్, జనార్ధన్ రావు,రవికుమార్, వరుణ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అందుబాటులో మెరుగైన వైద్య సేవలు

**• మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్**





**కల్లూరు, ఏప్రిల్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కల్లూరు పట్టణంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో నిర్మించిన 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మరిన్ని సౌకర్యాలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ వైద్యులు డాక్టర్ రమేష్ ఆధ్వర్యంలో హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన మెడికల్ స్టోర్‌ను మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం న్యూ ప్రతాప్ ల్యాబ్ అధినేత, కల్లూరు మున్సిపాలిటీ 18వ వార్డు కౌన్సిలర్ పెదకంటి రామకృష్ణ ఆధ్వర్యంలో హాస్పిటల్‌లో రక్త పరీక్షలు నిర్వహించే ఆధునిక ల్యాబ్‌ను కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడిన ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేద మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వారు పేర్కొన్నారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మెడికల్ స్టోర్ మరియు ల్యాబ్ ప్రారంభం కావడం వల్ల స్థానిక ప్రజలకు మరింత సౌలభ్యం కలుగుతుందని తెలిపారు. ఇకపై చిన్నచిన్న పరీక్షల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి, కౌన్సిలర్లు ఉబ్బన రాంబాబు, గుండ్ల పుల్లారావు, ఖమ్మంపాటి రాధ, దాసరి సుధారాణి, యాస నాగమణి, భూక్య రాంబాయి, జిల్లెల్ల స్వాతి, బానోతు మారోని, మహమ్మద్ ఇస్మాయిల్, నాయకులు శీలం కృష్ణారెడ్డి, సయ్యద్ ఇంతియాజ్, యాస శ్రీకాంత్, జిల్లెల్ల భాస్కర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

# గ్రామీణ అభివృద్ధితో ప్రజల జీవన ప్రమాణాల పెంపు లక్ష్యం

**డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క**

**కల్లూరులో రూ.10.50 కోట్లతో 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ప్రారంభం**

**కల్లూరు నారాయణపురంలో రూ.2.75 కోట్లతో 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి శంకుస్థాపన**

**కల్లూరు మండలం నారాయణపురంలో 33/11 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించిన డిప్యూటీ సీఎం, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**కల్లూరు, ఏప్రిల్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్) :** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితో ప్రజల జీవన ప్రమాణాల పెంపు లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క బుధవారం రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎన్.పి.డి.సి.ఎల్ సీఎండి వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సిపి సునీల్ దత్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ లతో కలిసి సత్తుపల్లి నియోజకవర్గం కల్లూరు మండలంలో పర్యటించారు. ముందుగా కల్లూరు మండలంలో నారాయణపురం గ్రామంలో 2 కోట్ల 75 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణ పనులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి శంకుస్థాపన చేసి,10 కోట్ల 50 లక్షల వ్యయంతో నిర్మించిన వైద్య విధాన పరిషత్‌కు చెందిన 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉందని తెలిపారు. ప్రతి గ్రామానికి నాణ్యమైన విద్యుత్, వైద్య సేవలు, మౌళిక సదుపాయాలు అందించడమే లక్ష్యమని అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని చెప్పారు.కల్లూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ద్వారా కల్లూరు, తల్లాడ, పెనుబల్లి మండలాల పరిసర పలు గ్రామాలకు చెందిన ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని రాష్ట్రంలోని ప్రతి వ్యక్తికి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చే లక్ష్యంతోనే ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళుతున్నదని తెలిపారు. 33/11 కేవి విద్యుత్ ఉపకేంద్రం ద్వారా పరిసర గ్రామాలకు నిరంతర విద్యుత్ సరఫరా మెరుగుపడుతుందని తెలిపారు. గ్రామీణ ప్రజలకు సమీపంలోనే మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఈ ఆసుపత్రి కీలకంగా నిలుస్తుందని పేర్కొన్నారు.మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం కట్టుబడి ఉందని, విద్యుత్, ఆరోగ్య రంగాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, హస్తకళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, వైరా శాసనసభ్యులు రామదాసు నాయక్, రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ , కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, విద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాసాచారి, డిసిహెచ్ఎస్ డా. రాజశేఖర్, వైద్యాధికారులు బి రమేష్, విద్యుత్ శాఖ, సంబంధిత శాఖల అధికారులు, ఏఎంసి చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్, మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, మున్సిపల్ వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి కృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, కౌన్సిలర్లు పెడకంటి రామకృష్ణ, ఉబ్బన రాంబాబు, యాస నాగమణి శ్రీకాంత్, ప్రజా ప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి ఫస్ట్ మార్కులు కరీంనగర్‌లోని కోట రెజోనెన్స్ విద్యార్థులకు రావడం గర్వకారణం...

**- విద్యార్థుల అభినందన సభలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం.**

**- కరీంనగర్లో కోట రెజోనెన్స్ జూనియర్ కళాశాల బ్రాండ్ ఇమేజ్ గా మారింది.**

**- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి.**










**కరీంనగర్,ఏప్రిల్15(పిసిడబ్ల్యూన్యూస్):** కరీంనగర్ లోని కోట ఇన్స్టిట్యూట్ వారి రెజోనెన్స్ జూనియర్ కాలేజ్ కరీంనగర్ కు ఇంటర్ ఫలితాల ద్వారా రాష్ట్ర స్థాయి గుర్తింపు తెచ్చి పెట్టిందని ఇది కరీంనగర్ కు గర్వకారణమని కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు కరీంనగర్ లోని రేకుర్తి లో గల కెపిఎస్ హైస్కూల్లో కోట రెజోనెన్స్ జూనియర్ కాలేజ్ విద్యార్థులకు రాష్ట్రస్థాయి ఫస్ట్ మార్కులు వచ్చిన సందర్భంగా బుధవారం ఏర్పాటుచేసిన అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు కరీంనగర్లో అనతి కాలంలోనే కార్పొరేట్ కళాశాలలను తలదన్నేలా గ్రామీణ ప్రాంతం నుండి మట్టిలో మాణిక్యాలను వెలికి తీయాలనె ఉద్దేశంతో ఉత్తమ పౌరులుగా తయారు చేయాలనే సంకల్పంతో కోట విద్యాసంస్థలను స్థాపించిన చైర్మన్ డాక్టర్ డి అంజిరెడ్డిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు ప్రపంచంలో చదువును మించిన ఆయుధం లేదని కష్టపడి చదువుకున్న వారే ఉన్నత స్థానాలలో ఉన్నారని కోట విద్యాసంస్థలు భవిష్యత్తులో మరిన్ని అద్భుత విజయాలు సాధించాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆకాంక్షించారు మరో అతిథి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు వచ్చిన అంజిరెడ్డి కరీంనగర్ కు రాష్ట్రస్థాయిలో కీర్తి తీసుకురావడం మనందరికీ గర్వకారణం అన్నారు ఫలితాలు రావడానికి ఇంకా టైం పడతది అనుకున్నా ఒక యజ్ఞంలా కృషిచేసి తొందరలోనే ఫలితం వచ్చేలా కృషిచేసిన డాక్టర్ డి అంజిరెడ్డి ఇదే స్ఫూర్తితో రాష్ట్రస్థాయి పరంపర కొనసాగించాలని కోరారు కోట ఇన్స్టిట్యూట్ అనేది ఇప్పుడు కరీంనగర్లో బ్రాండ్ ఇమేజ్ గా మారిందని కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు రాబోయే రోజుల్లో నెంబర్ వన్ గా కరీంనగర్ను తీర్చిదిద్దాలనే దానికి కోట విద్యాసంస్థలు బాటలు వేశాయని అన్నారు మరో అతిథి ట్రస్మ అధ్యక్షులు యాదగిరి శేఖర్ రావు మాట్లాడుతూ కోట విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ డి అంజిరెడ్డి యొక్క క్రమశిక్షణ అతనిని బ్రాండ్ ఇమేజ్కు దగ్గరగా తీసుకు వెళ్లిందని అన్నారు కోట విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ డి అంజిరెడ్డి మాట్లాడుతూ ఇక్కడి విద్యార్థులు ఎక్కడికో వెళ్లకుండా స్మార్ట్ క్లాస్ విద్యా విధానం ద్వారా స్థానికంగానే మంచి విద్య అందించాలనే ఉద్దేశంతో కోట విద్యాసంస్థలను స్థాపించి తొలి ప్రయత్నం లోనే రాష్ట్రస్థాయి మార్కులు సాధించడం గర్వకారణంగా ఉందని అన్నారు విద్యార్థులు వారి తల్లిదండ్రులు అధ్యాపక బృందం ఇచ్చిన ప్రోత్సాహంతో భవిష్యత్తులో మరిన్ని సంచలనాలు నమోదు చేస్తామని డాక్టర్ డి అంజిరెడ్డి అన్నారు. రాష్ట్రస్థాయిలో ఫస్ట్ మార్క్ సాధించిన ప్రథమ సంవత్సరం ఎంపీసీలో గాలి సౌమ్యశ్రీ 469, ద్వితీయ సంవత్సరం కే సహన శ్రీ 995 , ద్వితీయ సంవత్సరం బైపీసీలోజి రోషిని 993 , బైపిసి ప్రథమ సంవత్సరంలో పి శరణ్య438 లను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ట్రస్మా అధ్యక్షులు యాదగిరి శేఖర్ రావు లు అందించి పూల గుచ్చం అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు కోట విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ డి అంజిరెడ్డి ప్రిన్సిపాల్ అధ్యాపక బృందం సిబ్బంది పాల్గొన్నారు.

# అధిక ఉష్ణోగ్రతలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**వడదెబ్బ బారిన పడకుండా**

**తగు జాగ్రత్తలు పాటించాలి**

**వృద్ధులు, చిన్నపిల్లల పై ప్రత్యేక శ్రద్ధ**

**వహించాలి: జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**



**ములుగు ప్రతినిధి ఏప్రిల్ 15(పిసిడబ్ల్యూ న్యూస్ ):** జిల్లాలో అధిక ఉష్ణోగ్రత నమోదు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వడదెబ్బ బారిన పడకుండా పలు జాగ్రత్తలు పాటించాలని ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని అవసరమైతే తప్ప ఎండలో బయటకు రాకూడదని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. బుదవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల మధ్యలో ఎండ వేడిమి ఎక్కువగా ఉన్నందున దృష్ట్యా ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్ళకూడదని అన్నారు.అధిక ఉష్ణోగ్రతలో ,ప్రయాణాలు చేసినప్పుడు, పనుల నిమిత్తం వ్యవసాయ క్షేత్రానికి వెళ్లినప్పుడు అధిక ఉష్ణోగ్రత ప్రభావం వల్ల గుండె కొట్టుకోవడం, పల్స్ పెరగడం, ఊపిరితిత్తులు వేగంగా హెచ్చుతగ్గులతో కొట్టుకోవడం, లవణాలు, ఆక్సిజన్ మెదడుకు అందక పోవడం మూలంగా, మెదడు నరాలపై ప్రభావాన్ని చూపి, పిట్స్ , మూర్ఛ రావడం స్పృహ కోల్పోవడం, కోమాల్లోకి వెళ్లడం, అధిక జరం ,తీవ్రమైన తలనొప్పి, తల తిరగడం ఒళ్ళు నొప్పులు రావడం లాంటివి సంభవించే అవకాశం ఉంటుందని,ఎండ ఎక్కువగా ఉన్న సమయాలలో తప్పనిసరిగా గొడుగు, కొంగువాలు, టోపీ లేదా రుమాలు తప్పనిసరిగా ఉపయోగించుకునేలా చూసుకోవాలని,త్రాగునీరు, నిమ్మరసం, కొబ్బరి నీళ్ళు వంటివి కూడా సేవించాలని అన్నారు. పలచటి మజ్జిగ, గ్లూకోజ్ నీరు మరియు చిటికెడు ఉప్పు, చెంచా చక్కెర ఒక గ్లాసు నీటిలో కలుపుకొని ఇంట్లోనే తయారు చేయబడిన ఓ.ఆర్.ఎస్. ద్రావణం త్రాగించినట్లయితే వడదెబ్బ నుండి త్వరగా ఉపశమనం కలుగుతుందని పేర్కొన్నారు. వడదెబ్బ తగిలిన వారిని చల్లని ప్రదేశంలో ఉంచేలా చూడాలని, శరీర ఉష్ణోగ్రత పెరుగుతూ ఉంటుంది కనుక సాధారణ ఉష్ణోగ్రత వచ్చే వరకు తడి గుడ్డతో తుడుస్తూ ఉండాలని, వడదెబ్బకు గురి అయిన వారు ప్రాథమిక చికిత్స అనంతరం సాధారణ స్థితికి రాకుంటే, శరీరంలో అధిక ఉష్ణోగ్రత నమోదై చెమట పట్టకపోవడం వాంతులు స్పృహ కోల్పోవడం ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లాలని స్పష్టం చేశారు.గర్భిణీ స్త్రీలు, చిన్న పిల్లలు, వృద్ధులు, అనారోగ్యముతో ఉన్న వారు, వడ గాలులకు గురి కాకుండా కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు.వడదెబ్బ జాగ్రత్తలపై టామ్ టామ్, మైక్ అనౌన్స్‌మెంట్ ద్వారా ప్రచారం చేయాలని, గ్రామ పంచాయతీ కార్యాలయంలో, కూడలిలో వడదెబ్బ తగలకుండా ఉండే జాగ్రత్తలను వివరించినట్లు వంటి బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు.ఆశా వర్కర్లు, స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సమన్వయంతో తగిన పరిమాణంలో ORS ప్యాకెట్లు అందుబా టులో ఉంచుకునే విధంగా చూసుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీ సరిహద్దులో, ఎవెన్యూ ప్లాంటేషన్ మరియు రోడ్ల వెంబడి నాటిన మొక్కలు రోజుకు రెండు సార్లు పంచాయతీ ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేయాలని, పశువులకు మరియు జంతు వులకు ఎండ, వేడి నుండి కాపాడుటకు తగు జాగ్రత్తలు తీసుకొ నవలెను. వీటికి నీరు త్రాగుటకు తగిన సదుపాయాలు కల్పిం చాలని అన్నారు.వేసవి కాలం దృష్ట్యా స్థానిక ప్రజలకు అన్ని గ్రామ పంచాయతీలలో మండల కార్యాలయాలలో అవగాహన కార్య క్రమాలు చేపట్టాలని మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు.

## తిమ్మాపూర్ మోడల్ స్కూల్‌లో ఈ నెల 19న ప్రవేశ పరీక్ష

**కరీంనగర్ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 15(పీసీడబ్ల్యూ న్యూస్):** తిమ్మాపూర్ మోడల్ స్కూల్ లో 6వ తరగతికి వంద (100) సీట్లు, 7వ తరగతి నుండి 10వ తరగతిలో మిగిలిన సీట్ల కోసం నిర్వహించే ప్రవేశ పరీక్ష కోసం 19-04- 2026 (ఆదివారం)న తిమ్మాపూర్ మోడల్ స్కూల్ లో నిర్వహించబ డుతుంది. ఇట్టి పరీక్ష కోసం 6వ తరగతికి పరీక్ష ఉదయం 10-00 నుండి మధ్యాహ్నం 12-00 గంటల వరకు 7 నుంచి 10వ తరగతి వారికి మధ్యాహ్నం 2-00 నుండి 4-00 వరకు నిర్వహించబడును.ఇట్టి పరీక్షకు హాజరు కావడానికి https:/ /telanganams.cgg.gov.in/ వెబ్సైట్ నుంచి హాల్ టికెట్ డౌన్లోడ్ చేసుకోగలరు. తిమ్మాపూర్ మోడల్ స్కూల్ లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఎగ్జామ్ ప్యాడ్, బ్లూ లేదా బ్లాక్ పెన్ తో హాజరు అయి పరీక్ష రాయాలని తిమ్మాపూర్ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ శ్రీమతి ఎం. వనజ ఒక ప్రకటనలో తెలిపారు.

## టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా శనివారపు మోహన్ రెడ్డి నియామకం

**• హర్షం వ్యక్తం చేసిన నేతలు**

**సిద్ధవటం ఏప్రిల్ 15(పీసీడబ్ల్యూ న్యూస్): -** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కమిటీలో సిద్ధవటం మండలం, జ్యోతి గ్రామానికి చెందిన శనివారపు మోహన్ రెడ్డికి సముచిత స్థానం దక్కింది. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడే మోహన్ రెడ్డిని, ఆయన సేవలను గుర్తించిన అధిష్ఠానం ఆయనను రాష్ట్ర కార్యదర్శిగా నియమించింది. గతంలో మండల అధ్యక్షుడిగా పనిచేసిన మోహన్ రెడ్డికి రాష్ట్రస్థాయి పదవి దక్కడం పట్ల స్థానిక టీడీపీ నేతలు సంతోషం వ్యక్తం చేశారు.నిబద్ధత గల నాయకుడికి గుర్తింపు లభించడం శుభపరిణామమని వారు పేర్కొన్నారు.

## జ్యోతి గ్రామంలో ఘనంగా ఐదో విడత భూ రీ-సర్వే

**సిద్ధవటం ఏప్రిల్ 15(పీసీడబ్ల్యూ న్యూస్):** మండలంలోని జ్యోతి గ్రామంలో బుధవారం ఉదయం ఐదో విడత భూ రీ-సర్వే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిద్ధవటం మండల తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు శనివారపు మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జ్యోతి గ్రామంలో రీ-సర్వే ప్రక్రియ చేపట్టడం సంతోషదాయకమని, దీనివల్ల రైతులకు తమ భూములపై స్పష్టమైన హద్దులు ఏర్పడతాయని పేర్కొన్నారు.రైతుల భూ సమస్యల పరిష్కారానికి ఈ సర్వే ఎంతో దోహదపడుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విలేజ్ సర్వేయర్లు, వీఆర్వో , వివిధ శాఖల అధికారులు మరియు స్థానిక రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మున్సిపల్ అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే

**ప్రొద్దుటూరు ఏప్రిల్ 15(పీసీడబ్ల్యూ న్యూస్):** ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయం తన ఛాంబర్ నందు మున్సిపల్ అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి. 15వ ఫైనాన్స్ నిధుల కింద చేపట్టవలసిన ముఖ్యమైన పనుల గురించి అధికారులతో చర్చించి, వేసవి కాలం కాబట్టి నీటి పైపులు ఎక్కడన్నా లీకేజీలు ఉంటే తొందరగా పూర్తి చేయాలని,ప్రజలకు ఇబ్బంది లేకుండా నీరు అందుబాటులో ఉంచాలని,అధికారులు సరైన సమయానికి ఆఫీసుకు హాజరు కావడం లేదని, సరైన సమయానికి ఆఫీసుకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఎల్లవేళల ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని, ప్రజల వద్ద నుంచి డబ్బులు డిమాండ్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించిన ఎమ్మెల్యే నంద్యాల. మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## కష్టానికి ఫలితం ఈ పదవులు



**కడప ఏప్రిల్ 15(పీసీడబ్ల్యూ న్యూస్): -** కడప నగరంలోని కొండాయపల్లిలో తన కార్యాలయంలో సన్మానించి తమ శుభాకాంక్షలు తెలియజేసారు,తెలుగుదేశం పార్టీ బాలిశెట్టి హరిప్రసాద్ కు జాతీయ ఉపాధ్యక్ష పదవి ఇవ్వడము, మరియు టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి కి టిడిపి పార్టీలో పదవులు రావడం చాలా ఆనందకరమని, వారు ఇరువురు పార్టీకి ప్రజలకు మంచి పేరు తేవాలని మన్నెం చలపతిరావు నాయుడు కోరారు, ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపినాయకులు. అభిమానులు పాల్గొన్నారు

# నారీశక్తితో నవభారతాన్ని నిర్మిస్తున్న మోదీ ప్రభుత్వం...

**● బిజెపి మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు చొప్పరిజయశ్రీ**



**కరీంనగర్,ఏప్రిల్15(పీసీడబ్ల్యూ న్యూస్):** దశాబ్దాల నిరీక్షణకు స్వస్తి పలుకుతూ, నారీ శక్తివందన్ అధినియం ద్వారా ఆడబిడ్డలకు మోదీ అపురూప కానుక అందించి మోదీ ప్రభుత్వం నవ భారతాన్ని నిర్మిస్తుందని బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ అన్నారు. ఏప్రిల్ 16 న పార్లమెంట్ ప్రత్యేక సమావేశంలో చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించే నారీ శక్తి వందన్ అధినియం బిల్లును ప్రవేశపెడుతున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకొని బిజెపి మహిళా మోర్చా జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం రోజున కరీంనగర్లోనీ ఎస్ఆర్ఆర్ కళాశాల నుండి పట్టణంలోని పలు ప్రాంతాల మీదుగా మార్క్ ఫెడ్ వరకు స్కూటీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా అధ్యక్షులుగంగాడి కృష్ణారెడ్డి, నగర మేయర్ కోలగని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు జెండా ఊపి వాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా చొప్పరి జయశ్రీ మాట్లాడుతూ మహిళలకు చట్టసభలలో 33 శాతం రిజర్వేషన్ కల నెరవేరే సమయం వచ్చిందన్నారు. దశాబ్దాలు దేశాన్ని ఏలిన ఏ పార్టీ కూడా మహిళల సంక్షేమం, అభివృద్ధి కోసం ఆలోచన చేయలేదన్నారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం మహిళల సంక్షేమం అభివృద్ధి కోసం కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. అలాగే మహిళలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించడానికి, 33 శాతం రిజర్వేషన్లు అందించే చారిత్రక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. చారిత్రాక నారి శక్తి వందన్ అధినియం బిల్లుతో మహిళలకు దేశ ప్రధాని పెద్ద గిఫ్ట్ ఇవ్వబోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ దేశ శిల్ప, నిర్మల రెడ్డి, కోలగని స్వర్ణ, వరాల జ్యోతి, సాధవేని లావణ్య, కర్రె పద్మ, శ్వేత, ప్రభావతి, గాజిరమ, పొన్నం లక్ష్మి, నాంపల్లి రేణుక, పెద్దపల్లి శ్రీలేఖ, ఎన్నం లక్ష్మి, సరస్వతి, సుమ రమణారెడ్డి,సాయిని మల్లేశం, గుజ్జ శ్రీనివాసరావు, శశిధర్, బీజేవైఎం సంపత్, గుగ్గిళ్ళ రమేష్, సత్యనారాయణ రెడ్డి, సోమిరెడ్డి వేణు,, సునీత, స్వప్న, లావణ్య రెడ్డి, చైతన్య,, నరేడ్ల ప్రవీణ్ చంద్ర,, బండారి వేణు, చంద్రిక, వివిధ డివిజన్ మహిళలు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలను పాటిద్దాం – గృహానికి క్షేమంగా చేరుకుందాం

**తొర్రూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ పద్మావతి ఆధ్వర్యంలో రహదారి భద్రత ర్యాలీ నిర్వహణ**

**- కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తొర్రూర్ ఎస్సై ఉపేందర్ హాజరయ్యారు.**






**తొరూర్ ప్రతినిధి,ఏప్రిల్15(పీసీడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండల కేంద్రంలోని టి జిఎస్ ఆర్ టి సి డిపో లో విధులు నిర్వహించే అధికారులు , తొర్రూరు ఎస్సైతోపాటు ఉద్యోగులు స్థానిక డిపో నుండి గాంధీ సెంటర్ వరకు ట్రాఫిక్ నిబంధనలు పాటిద్దాం సురక్షితంగా ఇంటికి వెళ్దాం అంటూ ర్యాలీనీ బుధవారం నిర్వహించారు. బస్టాండ్ సెంటర్ వద్ద స్థానిక ఎస్సై ఉపేందర్ ప్రసంగిస్తూ రోడ్డు నిబంధనలు పాటిస్తూ డ్రైవర్లు వాహనాలు నడపాలని, మద్య సేవించి వాహనాలు నడపవద్దని అన్నారు . గృహము నుండి విధులు నిర్వహించేందుకు వచ్చే ప్రతి డ్రైవర్ ,కండక్టర్ కూడా ద్విచక్ర వాహనంపై వస్తున్నప్పుడు తలకు తప్పనిసరిగా హెల్మెట్ ను ధరించి విధులకు హాజరు కావాలని కోరారు. అనుకోని ప్రమాదాలు ఏమైనా జరిగినప్పుడు రక్షణ కవచంలా మనకు ఎంతో మేలు చేసే హెల్మెట్ ను ధరించినప్పుడే మనం సురక్షితంగా ప్రయాణించగలమని అన్నారు. ఇంటి నుండి బయలుదేరేటప్పుడు భార్య కానీ పిల్లలు కానీ హెల్మెట్ ను తీసుకువెళ్లాలని కోరినప్పటికీ కూడా కొందరు దగ్గరలోనే ఉంది కదా అని హెల్మెట్ ను తీసుకు రాకుండా నిర్లక్ష్యం చేస్తూ బయటికి వస్తున్నారని అలా కాకుండా హెల్మెట్ తన ప్రాణానికి ఎంతో మేలు చేస్తుందని గుర్తు చేశారు. అనంతరం డిపో మేనేజర్ పద్మావతి ప్రసంగిస్తూ ద్విచక్ర వాహనాలు పై వెళ్లేటప్పుడు సైతం విధిగా హెల్మెట్ ధరించాలని ప్రతి ఒక్కరూ రహదారి భద్రత సూత్రాలను, నిబంధనలు పాటిస్తూ, ఎదురుగా వచ్చే వాహనాలను గమనిస్తూ విధులు నిర్వహించాలని సూచించారు. ఆర్టీసీ డ్రైవర్లు వారు నడిపే బస్సులలో అందులో ప్రయాణిస్తున్న 50 మంది కుటుంబాల ను దృష్టిలో ఉంచుకొని అతి జాగ్రత్తగా నడిపించాలని డ్రైవర్లకు సూచించారు అలాగే ముందు వాహనాన్ని ఓవర్టేక్ కేసి సమయంలో ఎదురుగా ఉన్న వాహనాలకు దూరాన్ని పాటిస్తూ ఓవర్ టేక్ చేయాలని గుర్తు చేశారు. ఇది కాకుండా మూలమలుపుల వద్ద తొందరపడి వాహనాలను ఓవర్టేక్ చేయొద్దని రోడ్డు పూర్తిగా కనిపించినప్పుడే తన చేతిలో ఉన్న బస్సులను సురక్షితంగా నడిపినప్పుడే అందరూ క్షేమంగా ఉంటారని అన్నారు. రోడ్డు భద్రత సూత్రాలను పాటించి నప్పుడే సురక్షితంగా ఇంటికి చేరుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ఎం ఎఫ్ విజయ్ కుమార్, ఎస్టిఐ రజిత రెడ్డి, సూపర్వైజర్లు, డ్రైవర్లు, మెకానిక్ లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# విద్య, వైద్య రంగాలలో భారీ పెట్టుబడులతో ప్రజలకు మెరుగైన సేవలు ... డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క




**సత్తుపల్లిలో ఒకేరోజు మూడు ఆసుపత్రులు ప్రారంభం**

**రాష్ట్రవ్యాప్తంగా అదనంగా 14 వేల అదనపు స్పెషాలిటీ పడకల ఏర్పాటు లక్ష్యంగా చర్యలు**

**జూన్ 2 నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకం ప్రారంభం**

**ఆరోగ్యశ్రీ పరిమితిని 10 లక్షల రూపాయలకు పెంచిన ప్రభుత్వం**

**నిలిచిపోయిన ఆసుపత్రులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వచ్చాం**

**సత్తుపల్లిలో నిర్మించిన ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రినీ ప్రారంభించిన డిప్యూటీ సీఎం, మంత్రి పొంగులేటి**






**సత్తుపల్లి, ఏప్రిల్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్) :** విద్య, వైద్య రంగాలలో భారీ పెట్టుబడులతో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. డిప్యూటీ సి.ఎం. మల్లు భట్టి విక్రమార్క బుధవారం రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ లతో కలిసి సత్తుపల్లిలో 34 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన వైద్య విధాన పరిషత్ 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సి.ఎం. మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ సత్తుపల్లి పట్టణంలో వంద పడకల ఆసుపత్రిని ప్రారంభించడంతో పాటు నేడు ఇదే నియోజకవర్గంలో ఒక 50 పడకల ఆసుపత్రి, మరో 30 పడకల ఆసుపత్రి ప్రారంభోత్సవం, విద్యుత్ శాఖకు సంబంధించి పలు విద్యుత్ ఉప కేంద్రాల నిర్మాణ పనులకు శంకుస్థాపన, ఎకో టూరిజం ప్రాంతాన్ని పరిశీలన చేయడం జరిగిందని అన్నారు. నేడు ప్రారంభమైన ఆస్పత్రులు ప్రజల పట్ల ప్రజా ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం అని డిప్యూటీ సీఎం తెలిపారు. విద్య, వైద్య రంగాలపై అధికంగా పెట్టుబడి పెడుతూ ప్రజలకు మెరుగైన వసతులు కల్పిస్తున్నామని అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించేందుకు 14 వేల అదనపు పడకలు అందుబాటులోకి తీసుకొని వచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కార్పొరేట్ స్థాయిలో పేద ప్రజలు కూడా విద్య అందుకోవాలని లక్ష్యంతో ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నామని అన్నారు. డిజిటల్ విద్యా, క్రీడలు, కల్చరల్ యాక్టివిటీస్ అందుబాటులో ఉండేలా ఆ స్కూల్స్ నిర్మాణం అవుతున్నాయని తెలిపారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రస్తుతం ఉన్న రెసిడెన్షియల్ స్కూల్స్ లో పిల్లలకు మంచి నాణ్యమైన ఆహారం అందించేందుకు 40 శాతం డైట్ చార్జెస్, 200 శాతం కాస్మొటిక్ చార్జీలు పెంచడం జరిగిందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 20 లక్షలకు పైగా విద్యార్థుల కోసం రాబోయే జూన్ 2 నుంచి అల్పాహార పథకం ప్రారంభిస్తామని తెలిపారు. నైపుణ్య విద్య ప్రోత్సహించడమే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్లను మంజూరు చేసి యువతకు ఉపాధి లభించేలా అవసరమైన నైపుణ్యాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. హైదరాబాదులో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి అడ్వాన్స్ సెంటర్ లను దానికి అనుబంధంగా చేయడం చేస్తున్నామని అన్నారు. ఏటీసీ సెంటర్లలో వివిధ కోర్సులు చేసే విద్యార్థులకు ప్రతినెల 2 వేల రూపాయల స్కాలర్షిప్ అందిస్తుందని అన్నారు. మన విద్యార్థులకు ఇక్కడే కాకుండా విదేశాలలో కూడా ఉపాధి అవకాశాలు లభించే విధంగా టామ్ కామ్ వ్యవస్థ ఏర్పాటు చేశామని అన్నారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి ఆహార కొరత లేకుండా కోటి ఆరు లక్షల కుటుంబాలకు సన్న బియ్యం ప్రతినెలా సరఫరా చేస్తున్నామని అన్నారు. ఖమ్మం జిల్లా వ్యవసాయ ఆధారితమైన జిల్లా అని, ఇక్కడ రైతుల కోసం గత కాంగ్రెస్ హయాంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మించి ఆయకట్టు తీసుకొని వచ్చామని, నేడు మన ఇందిరమ్మ ప్రభుత్వం పెద్ద ఎత్తున నీటి వసతి కల్పించడం కోసం అనేక ప్రాజెక్టులు చేపట్టిందని, ప్రస్తుతం జిల్లాలో 3,40,000 ఎకరాలకు ఆయకట్టు ఉంటే, అదనంగా మరో 3 లక్షల 16 వేల ఎకరాలకు పైగా ఆయకట్టు నీరు అందించేందుకు ప్రభుత్వం 2500 కోట్లు విడుదల చేశామని అన్నారు.మన రాష్ట్రంలో అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలు దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. పేదలు ఇండ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం నేరుగా 5 లక్షల రూపాయలు విడుదల చేస్తుందని, దేశంలో ఎక్కడ ఇటువంటి పథకం అమలులో లేదని అన్నారు. ఇండ్ల నిర్మాణానికి సంబంధించి పురోగతి ఆధారంగా ప్రతివారం నిధులు విడుదల చేయడం జరుగుతుందని అన్నారు.పులి గుండాల చెరువు , కనికగిరి హిల్స్ ప్రపంచ టూరిజం స్థాయిలో అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ప్రతి పేదవాడికి వైద్యానికి, విద్యకు ఎటువంటి లోటు రాకూడదనీ, ధనికులకు ఎటువంటి వైద్యం, విద్య అందుతున్నాయో, అటువంటి విద్య, వైద్యం పేదలకు అందాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించక పోయినా పేదవాడే ప్రభుత్వానికి లోకమని భావించి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని అన్నారు. దివంగత నేత వైయస్సార్ ముఖ్యమంత్రి ఉన్నప్పుడు ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారని, గత పాలకులకు చిత్తశు ద్ధి లేని కారణంగా పేదలు వైద్యం కోసం అనేక అవస్థలు పడ్డారని మంత్రి తెలిపారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటకు కట్టుబడి అధికారంలోకి వచ్చిన 48 గంటల వ్యవధిలో రాజీవ్ ఆరోగ్య శ్రీ పరిమితిని 10 లక్షలకు పెంచడం జరిగిందని అన్నారు. గత ప్రభుత్వం నూతన ఆస్పత్రులు, మెడికల్ కాలేజీలు, నర్సింగ్ కాలేజీలను కాగితాలకే పరిమితం చేస్తే తాము వాటిని వేగవంతంగా పూర్తి చేసి పేదలకు మెరుగైన సేవలు అందిస్తున్నామని అన్నారు. సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలో గత ప్రభుత్వం మధ్యలో వదిలిపెట్టిన మూడు ఆసుపత్రులను వేగంగా పూర్తి చేసి నేడు ప్రారంభించుకుంటున్నామని అన్నారు. వందల కోట్లు ఖర్చు చేసి ఆసుపత్రుల నిర్మాణాలను పూర్తి చేస్తున్నామని, కల్లూరు లో 50 పడకలు, పెనుబల్లి 30 పడకలు, సత్తుపల్లి లో 100 పడకల ఆసుపత్రులు నేడు ప్రారంభిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా వైద్యుల కొరత తగ్గించేందుకు వెంటనే అవసరమైన నియామక ప్రక్రియ చేపట్టాలని ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 200 కోట్లు ఖర్చు చేస్తూ దాదాపు 25 ఎకరాల విస్తీర్ణంలో 2500 మంది వివిధ వర్గాలకు చెందిన విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఇండియా సమీకృత గురుకులాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. యంగ్ ఇండియా సమీకృత గురుకులాలతో పాటు, ప్రత్యేకంగా తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు చేసామని ఈ పనులు కూడా త్వరలోనే ప్రారంభం అవుతాయని అన్నారు. గత ప్రభుత్వాలు చేసిన మంచి కార్యక్రమాలను కొనసాగిస్తూనే అదనంగా సన్న బియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, నూతన రేషన్ కార్డులు జారీ , మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం వంటి అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు.గత పాలకులు కమీషన్లకు కక్కుర్తి పడి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారు తప్ప పేదలకు ఇండ్లు కట్టలేదని మంత్రి విమర్శించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన మొదటి సంవత్సరంలోనే 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసిందని, త్వరలో మరో విడత ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన చివరి లబ్ధిదారుడి వరకు రాజకీయాలకతీతంగా తప్పనిసరిగా ఇందిరమ్మ ఇండ్లను తమ ప్రభుత్వం కేటాయిస్తుందని మంత్రి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ 64 కోట్ల వ్యయంతో సత్తుపల్లి నియోజకవర్గంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలు నేడు ప్రారంభించుకోవడం జరిగిందని అన్నారు. సత్తుపల్లి, అశ్వారావు పేట, సమీపంలోని ప్రాంత ప్రజలకు ఇక్కడి 100 పడకల ఏరియా ఆసుపత్రి ఉపయోగ పడుతుందని అన్నారు.సత్తుపల్లి ఏరియా ఆసుపత్రిలో ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని, కార్పొరేట్ దీటుగా అనేక సేవలు అందిస్తామని అన్నారు. మంత్రి వర్యుల ఆదేశాల మేరకు కాంట్రాక్ట్ పద్ధతిన వైద్యుల భర్తీ పూర్తి చేసి ఖాళీ లేకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ ఒకే రోజు 3 ఆసుపత్రులను సత్తుపల్లి నియోజకవర్గంలో ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. గత ప్రభుత్వాలు నామమాత్రపు నిధులు కేటాయించి నిర్మాణాలను మధ్యలోనే వదిలేస్తే, ప్రజా ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేసి అధునాతన వసతులతో ఆసుపత్రులను పూర్తి చేసి ప్రారంభించింది అని అన్నారు. విద్యా, వైద్య రంగాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహించి, పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందాలనే లక్ష్యంతో ప్రభుత్వ ఆసుపత్రులను తీర్చిదిద్దుతున్నారని అన్నారు. గతంలో డయాలసిస్ 5 పడకలు మాత్రమే ఉండేవని నేడు వాటిని 10 పడకలకు పెంచడం జరిగిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సత్తుపల్లి ఆసుపత్రి వైద్యుల ఖాళీలను త్వరలోనే భర్తీ చేస్తామని, వివిధ ప్రత్యేక వైద్యులు కూడా సత్తుపల్లి ఆసుపత్రిలో అందుబాటులో ఉంటారని, అత్యవసర చికిత్సలు ఇకనుంచి సత్తుపల్లి నుంచే అందుబాటులో ఉంటాయని, ఈ ఆసుపత్రి ప్రారంభించడంలో సహకరించిన ప్రతి ఒక్కరికి ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ రామారావు, డిసిహెచ్ఎస్ రాజశేఖర్ గౌడ్, తహసీల్దార్, ఎంపీడీఓ, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు, పాల్గొన్నారు.



# విద్యుత్ మౌళిక వసతుల విస్తరణతో పేదల అభివృద్ధి: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క





**గ్రామీణ విద్యుత్ సరఫరా మెరుగుదలకు సబ్ స్టేషన్ కీలకం**

**పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా అదనపు విద్యుత్ ఉపకేంద్రాల నిర్మాణం**

**నిరుపేదలకు ప్రభుత్వ భూముల్లో ఇంటి పట్టాల పంపిణీకి హామీ**

**మహిళల ఆర్థికాభివృద్ధికి వడ్డీ లేని రుణాలు, సంక్షేమ పథకాల అమలు**

**సత్తుపల్లి మండలం రేజర్ల గ్రామంలో ఏర్పాటు చేయనున్న 33/11 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం, మంత్రి పొంగులేటి**

**సత్తుపల్లి, ఏప్రిల్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్):**విద్యుత్ మౌళిక వసతుల విస్తరణతో పేదల అభివృద్ధి సాధ్యం అవుతుందని డిప్యూటీ సి.ఎం. మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. డిప్యూటీ సి.ఎం. మల్లు భట్టి విక్రమార్క బుధవారం రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎన్పిడిసియల్ సిఎండి వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ లతో కలిసి సత్తుపల్లి మండలం రేజర్ల గ్రామంలో ఏర్పాటు చేయనున్న 33/11 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా



ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సి.ఎం. మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడేందుకు ఈ సబ్ స్టేషన్ ఉపయోగపడుతుందని తెలిపారు. రైతులకు, గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్తు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ఎక్కడ కోతలు జరగకుండా అవసరమైన చోట అదనపు విద్యుత్ ఉప కేంద్రాలను నిర్మిస్తున్నామని తెలిపారు. నిరుపేదలకు ప్రభుత్వ స్థలాలలో ఇంటి పట్టాలు పంపిణీ చేయడం గత కాంగ్రెస్ హయాంలో అనేకసార్లు చేపట్టిందని గుర్తు చేశారు. గత ప్రభుత్వ పాలనలో ఈ ప్రక్రియ పూర్తిస్థాయిలో విస్మరించిందని, భవిష్యత్తులో రేజర్ల గ్రామంలో అర్హులైన నిరుపేదలకు తప్పనిసరిగా ఇంటి పట్టాలు అందిస్తామని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. నూతన రేషన్ కార్డుల జారీ, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, మహిళలకు వడ్డీ లేని రుణాలు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి అనేక కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ప్రభుత్వానికి



వచ్చే ప్రతి రూపాయి పేద ప్రజల కోసం ఖర్చు చేయడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. మహిళలు డ్వాక్రా సంఘాలలో చేరి వడ్డీ లేని రుణాలు పొంది ఆర్థికంగా ఎదగాలని సూచించారు. గ్రామంలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమిలో సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామానికి అవసరమైన అన్ని అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం తప్పనిసరిగా అమలు చేస్తుందని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా పేదల సంక్షేమం, అభివృద్ధిని తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోందన్నారు. అభివృద్ధి, సంక్షేమం జోడెద్దుల్లాగా ప్రభుత్వం ప్రజలకు అందిస్తోందని పేర్కొన్నారు. ఈ రోజే మూడు కొత్త ఆసుపత్రులను ప్రారంభించడంతో పాటు 4 కొత్త సబ్ స్టేషన్‌లకు శంకుస్థాపనలు చేసినట్లు తెలిపారు. నిన్ననే సత్తుపల్లిలో యంగ్ ఇండియా స్కూల్‌కు శంకుస్థాపన చేసినట్లు వెల్లడించారు. పేదల సంక్షేమం కోసం 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్న బియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల వంటి అనేక కార్యక్రమా లను ప్రభుత్వం అమలు చేస్తున్నదని తెలిపారు. ధనికులు సమాజంలో ఎలా జీవిస్తారో అదే స్థాయిలో ప్రతి పేదవాడు ఆత్మగౌరవంతో జీవించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతున్నదని పేర్కొన్నారు. రేజర్ల గ్రామంలోని ప్రభుత్వ భూమిలో లేఔట్ ఏర్పాటు చేసి అర్హులైన నిరుపేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేస్తామని, స్థానిక ఎమ్మెల్యే ప్రతిపాదన మేరకు ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్తామని మంత్రి హామీ ఇచ్చారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ ఈ రోజు డిప్యూటీ సీఎం, మంత్రి పొంగులేటి కలిసి అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే మరో విడత ఇందిరమ్మ ఇళ్ల జాబితా విడుదల అవుతుందని పేర్కొన్నారు. సుమారు 400 మందికి గృహ స్థలాలను కేటాయించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, హస్తకళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఎస్ఈ ఎన్పిడిసిఎల్ శ్రీనివాస చారి, తహసీల్దార్, ఎంపీడీఓ, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

---

# పులిగుండాల ప్రాజెక్ట్‌ను దేశంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

**పులిగుండాల ప్రాజెక్ట్ పరిసరాల్లో కాటేజీల నిర్మాణానికి 4 కోట్లు మంజూరు**

**కనకగిరి హిల్స్ అభివృద్ధి పనులు తక్షణమే ప్రారంభించాలి**

**పర్యాటకుల సౌలభ్యం కోసం డబుల్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలి**

**పెనుబల్లి మండలం బ్రాహ్మల్ల కుంట గ్రామంలో పులిగుండాల ట్యాంక్ వద్ద పులిగుండాల ఎకో టూరిజం ప్రాజెక్ట్ ను ప్రారంభించి, పరిశీలించిన డిప్యూటీ సీఎం, మంత్రి పొంగులేటి**

**పెనుబల్లి, ఏప్రిల్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్) :**పెనుబల్లి మండలం బ్రాహ్మల్లకుంట గ్రామంలోని పులిగుండాల ట్యాంక్ వద్ద ఏర్పాటు చేసిన పులిగుండాల ప్రాజెక్ట్‌ను దేశంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. డిప్యూటీ సీఎం బుధవారం, రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పిసిసిఎఫ్ సువర్ణ, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సిపి సునీల్ దత్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ భీమా నాయక్, జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్ లతో కలిసి పులిగుండాల ఎకో టూరిజం ప్రాజెక్ట్ ను ప్రారంభించి పరిశీలించారు. ఈ సందర్భంగా బోటింగ్, వాటర్ ఫాల్స్, జంగిల్ సఫారీ లను ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సి.ఎం. మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఈ అందమైన ప్రదేశాన్ని పరిచయం చేసిన స్థానిక ఎమ్మెల్యే, డి.ఎఫ్.ఓ. లకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎకో టూరిజం అభివృద్ధిని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోందని, తెలంగాణలోని ప్రకృతి సౌందర్యాలను ప్రపంచానికి పరిచయం చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. కనకగిరి హిల్స్ అభివృద్ధిని తక్షణమే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పులిగుండాల ప్రాజెక్ట్ నీటి పరిసర ప్రాంతాల్లో రెండు వైపులా కాటేజీల నిర్మాణానికి 4 కోట్లు సిఎస్ఆర్ నిధుల నుండి మంజూరు చేయనున్నట్లు తెలిపారు. పనుల అమలుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను వెంటనే సిద్ధం చేసి, పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయి, ఎప్పుడు పూర్తవుతాయి అనే కాలపట్టికను సిద్ధంగా ఉంచాలని అధికారులకు సూచించారు. పర్యాటకులు ఈ ప్రాంతానికి సులభంగా చేరుకునే విధంగా డబుల్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు వెంటనే పంపించాలని ఆదేశించారు. ఈ ప్రాంతంలో ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేస్తే స్థానిక ప్రజలకు విస్తృత స్థాయిలో



ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యాటక రంగాన్ని విస్తృతంగా ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. భవిష్యత్తులో పులిగుండాల ప్రాజెక్ట్‌ను దేశంలోని ప్రముఖ పర్యాటక కేంద్రాలలో ఒకటిగా అభివృద్ధి చేస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ కనకగిరి హిల్స్ వంటి అందమైన ప్రాంతాలను సందర్శించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి రాష్ట్రానికి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎకో టూరిజం క్రింద రాష్ట్రంలో టాప్ 3 గమ్యస్థానాలలో ఒకటిగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని అన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి అవసరమైన పూర్తి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని, అన్ని విధాల అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎకో టూరిజం అభివృద్ధిపై పూర్తి దృష్టి సారించిందన్నారు. అలాగే ఈ ప్రాంతానికి వెళ్లే యాక్సెస్ రోడ్డు ను డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేయడానికి తక్షణమే అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వం ప్రారంభించి మిగిలిపోయిన సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులను ప్రస్తుత ప్రభుత్వం వేగంగా పూర్తి చేస్తోందన్నారు. స్థానిక ఎమ్మెల్యే సూచన మేరకు ఆ ప్రాజెక్ట్ నుండి ఈ ప్రాంతానికి నీటిని తీసుకువచ్చి నిరంతర నీటి సరఫరా కల్పించే అవకాశాలను పరిశీలిస్తామని తెలిపారు. సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసి, సాధ్యమైతే ఈ పనులను పూర్తి చేస్తామని మంత్రి పేర్కొన్నారు. ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ చెట్లు లేకుండా జీవనం సాధ్యం కాదని, మనిషి జీవితం చెట్లపై ఆధారపడి ఉందని తెలిపారు. మనకు అవసరమైన ఆక్సిజన్ చెట్ల నుంచే లభిస్తుందని, మనిషి అవసరాలకు ఉపయోగించే మంచం వంటి అనేక వస్తువులు కూడా చెట్ల నుంచే వస్తాయని తెలిపారు. అటవీ సంరక్షణకు ప్రభుత్వం, మంత్రులు ప్రతిష్టాత్మకంగా కృషి చేస్తున్నారని తెలిపారు. కనకగిరి హిల్స్‌కు ఎకో టూరిజం క్రింద నిధులు, నీలాద్రి హిల్స్‌కు దేవాలయ పర్యాటక అభివృద్ధి క్రింద నిధులను డిప్యూటీ సీఎం, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మంజూరు చేయడం జరిగిందన్నారు. మన చుట్టూ ఉన్న అందమైన ప్రకృతిని కాపాడేందుకు అధికారులు ఎంతో శ్రమిస్తున్నారని తెలిపారు. పులిగుండాల ఎకో టూరిజం ప్రాజెక్ట్ ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు లభించడమే కాకుండా, మన సంస్కృతి, వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేసే అవకాశం కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

---

# ప్రశ్నించినందుకే కేసులా..?

**- పోటు రంగారావుకు ఇచ్చిన ఎన్ఐఏ నోటీసులపై ఖమ్మంలో నిరసన గళం**

**- ప్రజా ఉద్యమాలపై దాడిగా ఆరోపణ...**

**- నోటీసులు వెంటనే ఉపసంహరించాలని డిమాండ్**

**- సిపిఐ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు ఆవుల అశోక్, జి. రామయ్య డిమాండ్**

**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రజా సమస్యలపై పోరాడుతున్న ఉద్యమకారులపై తప్పుడు కేసులు మోపడం ప్రజాస్వామ్యానికి విఘాతం అని ఆరోపిస్తూ వాటిని వెంటనే ఎత్తివేయాలని సిపిఐ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు ఆవుల అశోక్ జి రామయ్య డిమాండ్ చేశారు. సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఆధ్వర్యంలో బుధవారం ఖమ్మంలో భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావుకు నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఎ) జారీ చేసిన నోటీసులను వెంటనే ఎత్తివేయాలని నాయకులు డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెవిలియన్ గ్రౌండ్ నుంచి వైరా రోడ్డుమార్గంగా అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహించిన ర్యాలీలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఎలాంటి ఆధారాలు లేకుండా దేశద్రోహం, యూఏపీఏ వంటి తీవ్రమైన కేసులు మోపడం అన్యాయమని పేర్కొన్నారు. **"50 ఏళ్ల ఉద్యమ జీవితం... ఇప్పుడు ఆరోపణల బారిన" భావోద్వేగ స్పందన** పోటు రంగారావు ఐదు దశాబ్దాలుగా విద్యార్థి, యువజన, కార్మిక ఉద్యమాల్లో పాల్గొంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్నారని నాయకులు గుర్తుచేశారు. అలాంటి వ్యక్తిపై అక్రమంగా కేసులు మోపడం వెనుక ప్రజా ఉద్యమాలను అణచివేయాలనే ఉద్దేశం ఉందని విమర్శించారు. ప్రజల సమస్యలను ప్రశ్నించే స్వరాలను అణచివేయడానికి ప్రభుత్వాలు ఇలాంటి చర్యలకు దిగుతున్నాయని, ఇది సాధారణ ప్రజల జీవితాలపై కూడా ప్రభావం చూపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. "న్యాయం కోసం నిలబడే స్వరం మౌనమైతే, బాధలు చెప్పుకునే వేదికలు కూడా కనుమరుగవుతాయి" అంటూ భావోద్వేగంగా స్పందించారు. సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకత్వంగానీ, పోటు రంగారావు గానీ హింసకు వ్యతిరేకమని, చట్టబద్ధ కార్యకలాపాలను నిర్వహిస్తున్నారనీ, ఇటువంటి ఉద్యమాలను కూడా కేంద్ర ప్రభుత్వం తప్పుడు పద్ధతులలో, దేశద్రోహం, ఉపా, అక్రమ ఆయుధాలు కల్గి ఉన్నాడని లాంటి కుట్టపూరితమైన నోటీసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ చర్యలను వెంటనే ఉపసంహరించకపోతే జిల్లా నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని



హెచ్చరించారు. సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ చట్టబద్ధంగా బహిరంగ కార్యకలాపాలను నిర్వహిస్తూ, ప్రజా సమస్యల మీద పోరాడుతున్నదని, పాలకవర్గాలు పెట్టుబడిదారీ వర్గాలు ప్రజలను దోపిడీ చేస్తున్న తీరుతెన్ను లను ప్రజలకు వివరించి, చైతన్య పరుస్తున్నందుకు తప్పుడు కేసులను బనాయించి జైల్ లో బంధించటానికి పూనుకున్నరని వారు విమర్శించారు. ప్రొఫెసర్ సాయిబాబా, వరవరరావు, జేఎన్యు యూనివర్సిటీ నాయకుడు ఉమర్ ఖలీదు, హరగోపాల్, విమలక్క, గాదె ఇన్నయ్య తదితరుల మీద కూడా తీవ్రవాద కార్యకలాపాల నిరోధక చట్టం, దేశద్రోహం కేసులను మోపిందనీ, ఆ తర్వాత నిర్ధారణ లేక ఎత్తివేసిందని తెలిపారు. సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు సి.వైపుల్లయ్య, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ సిరోమణి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్ శివలింగం, బందెల వెంకయ్య, ఏ వెంకటరెడ్డి, ఖమ్మం జిల్లా నాయకులు మలీదు నాగేశ్వరరావు, కమ్మకోమటి నాగేశ్వరరావు, ఎస్.కె లాల్ మియా, పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి టీ ఝాన్సీ, ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కార్యదర్శులు గంటా శ్రీనివాసరావు, తిమ్మిడి హన్మంతరావు తదితరులు ప్రసంగించారు. బీరెల్లి లాజర్, కె శ్రీనివాస్ ఖమ్మం నగర కమిటీ కార్యదర్శి పి శోభ, ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ కోశాధికారి ఏ శరత్, సహాయ కార్యదర్శి బల్లె పల్లి వెంకటేశ్వర్లు ప్రదర్శన యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వి రాకేష్, అఖిల భారత ప్రగతిశీల ఐక్య రైతు సంఘం జిల్లా కోశాధికారి కేలోతు లక్ష్మణ్, ప్రగతిశీల యువజన సంఘం జిల్లా కార్యదర్శి జిక్కుల భరత్, పిడిఎస్యు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టి లక్ష్మణ్, వి వెంకటేష్,, కారేపల్లి, కామేపల్లి మండల కార్యదర్శి గుమ్మడి సందీప్, కల్లూరు పెనుబల్లి మండల కార్యదర్శి కే పుల్లారావు, తిరుమలాయపాలెం మండల కార్యదర్శి సోమనపల్లి వెంకటేశ్వర్లు, వైరా డివిజన్ కమిటీ నాయకులు పాశం అప్పారావు, పాలేరు డివిజన్ నాయకులు రెంటాల యాదగిరి,కుర్ర వెంకన్న, వీర్ల వెంకట అప్పారావు, పుచ్చకాయల శ్రీనివాసరావు, విజయ్ ఖమ్మం డివిజన్ నాయకులు తేజా నాయక్, కూరాకుల నరసయ్య, కల్లూరు డివిజన్ నాయకులు కొండే వెంకటేశ్వర్లు, వైరా డివిజన్ నాయకులు జి శివ,ఎస్ కె జానీ, గుణగంటి వీరబాబు, అవిరేణి వెంకన్న, ఎస్ కె సత్తార్ మియా, ధరావత్లక్ష్మణ్, ప్రసాద్, జాస్మిన్, పలు ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఐక్యతను వ్యక్తం చేశారు.

# ఖమ్మంను 'ఎయిడ్స్ రహిత' జిల్లాగా మార్చడమే లక్ష్యం

**- హెచ్.ఐ.వి బాధిత చిన్నారులకు పౌష్టికాహార పంపిణీ**

**- అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చందు నాయక్**





**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మంను 'ఎయిడ్స్ రహిత' జిల్లాగా మార్చడమే లక్ష్యం అని అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చందు నాయక్ అన్నారు. ఆలయ ఫౌండేషన్ మార్గదర్శకులు పరికిపండ్ల నరహరి, ఐ.ఆ.స్. ఆదేశాల మేరకు ఆలయ ఫౌండేషన్, ఆశా పాజిటివ్ పీపుల్ అసోసియేషన్ (ఖమ్మం కేర్ సపోర్ట్ సెంటర్) సంయుక్త ఆధ్వర్యంలో, స్థానిక కేర్ అండ్ సపోర్ట్ సెంటర్ కార్యాలయంలో బుధవారం 13 హెచ్.ఐ.వి బాధిత చిన్నారులకు పౌష్టికాహార పంపిణీ కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (ఎయిడ్స్ అండ్ లెప్రసీ) డాక్టర్ చందు నాయక్ మాట్లాడుతూ, హెచ్.ఐ.వి వైరస్‌తో జీవిస్తున్న వారికి పౌష్టికాహారం అత్యంత కీలకమని పేర్కొన్నారు. సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా శరీరంలో వ్యాధి నిరోధక శక్తి పెరిగి, వైరస్ అదుపులో ఉంటుందని వివరించారు. ప్రభుత్వ ఏఆర్టి సెంటర్ ద్వారా లభించే మందులతో పాటు పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చని ఆయన భరోసా ఇచ్చారు. నాకో (ఎన్ఏసీఓ), తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ నిర్దేశించిన 95-95-99 లక్ష్యాలను అధిగమించి, ఖమ్మం జిల్లాను ఆదర్శంగా నిలపాలని పిలుపునిచ్చారు. హెచ్.ఐ.వి బాధిత చిన్నారులు చదువు విషయంలో ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారికి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. చిన్నారుల ఉన్నత చదువుల కోసం ఆర్థికసాయం అందించే విషయంపై ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని హామీ ఇచ్చారు. స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ లెప్ర సొసైటీ టి. వెంకేశ్వర్లు మాట్లాడుతూ... హెచ్ఐవి తో జీవిస్తు గవర్నమెంట్ ఆర్ట్ సెంటర్ లో మందులు తీసుకుంటున్న వారిని క్రమం తప్పకుండా మందులు వాడించాలని, తద్వారా వైరల్ లోడ్ తగ్గి సంపూర్ణ ఆరోగ్యముతో జీవిత కాలము కూడా పెరగడానికి అవకాశము ఉంటుందని చెప్పారు. అలాగే ఫాలో యుపి చేసిన రిపోర్ట్స్ అన్ని వివరాలను సోచ్ మొబైల్ అప్ ద్వారా ఎంట్రీ చేయాలనీ చెప్పారు. అప్పా ప్రాజెక్ట్ మేనేజర్ శంకర్ మాట్లాడుతూ... తమ సంస్థ గత 20 ఏళ్లుగా హెచ్.ఐ.వి/ఎయిడ్స్ నివారణకు అంకితభావంతో పనిచేస్తోందని తెలిపారు. బాధితులకు చికిత్స, మందుల వాడకంపై అవగాహన కల్పించడంతో పాటు, క్రమం తప్పకుండా వైరల్ లోడ్ పరీక్షలు చేయిస్తున్నామని వివరించారు. ముఖ్యంగా తల్లి నుండి బిడ్డకు వైరస్ సోకకుండా అనేక నివారణ కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం మేనేజర్ సత్య కుమార్, హైదరాబాద్ లెప్రా సంస్థ స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ టి. వెంకటేశ్వర్లు, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం అసిస్టెంట్ రామకృష్ణ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సుందర్, నవీన్, రాము కో-ఆర్డినేటర్స్, రవికుమార్, గౌస్ భాష ఫైనాన్స్ ఆఫీసర్స్, కమ్యూనిటీ లైసోన్ ఫర్ హెల్త్, బాధిత చిన్నారుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పెన్షనర్ల కన్నీళ్లు ఆరాలంటే వెంటనే నిర్ణయాలు తీసుకోవాలి




**- ఉద్యోగుల సమస్యలపై టీజీఈ జేఏసీ గళం**


**- అనిశ్చితిలో 15.25 లక్షల కుటుంబాల భవిష్యత్తు, పరిష్కారం కోసం వినతి పత్రం**



**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల జీవితాలను ప్రభావితం చేస్తున్న దీర్ఘకాలిక సమస్యలు వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఎంప్లాయిస్, గెజిటెడ్ ఆఫీసర్స్, టీచర్స్, వర్కర్స్, పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఖమ్మం జిల్లా యూనిట్ గళమెత్తింది. జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ (రెవిన్యూ) పి. శ్రీనివాస్ రెడ్డికి జెడ్ఎస్ జైపాల్, మోదుగు వేలాద్రి నేతృత్వంలో వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా 15.25 లక్షల ఉద్యోగుల కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలు ఇక ఆలస్యం చేయలేని స్థితికి చేరాయని జేఏసీ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. **'వేతనం, ఆరోగ్యం, పెన్షన్'.. జీవనాధారాలపై ఆందోళన** పిఆర్సి అమలు ఆలస్యం కావడం, పెండింగ్ బిల్లులు పేరుకుపోవడం, ఆరోగ్య కార్డులు అందుబాటులో లేకపోవడం, పాత పెన్షన్ విధానం అమలు కాకపోవడం వంటి కీలక అంశాలు ఉద్యోగుల జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని జేఏసీ స్పష్టం చేసింది. ప్రతి నెల సుమారు 600 మంది ఉద్యోగులు రిటైర్ అవుతుండగా, వారికి రావాల్సిన బకాయిలు వేల కోట్లకు చేరి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నాయని పేర్కొన్నారు. వైద్య సేవలు అందక అనారోగ్యంతో బాధపడుతున్న ఉద్యోగులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న కష్టాలను గుర్తించి మానవీయ కోణంలో ప్రభుత్వం వెంటనే స్పందించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకుని పిఆర్సి అమలు, రూ. 13,000 కోట్ల పెండింగ్ బిల్లుల విడుదల, ఆరోగ్య కార్డుల జారీ, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరణ వంటి డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరారు. లేకపోతే దశలవారీ ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలు ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొని ఉద్యోగుల, పెన్షనర్ల సమస్యలపై ఏకగ్రీవంగా మద్దతు తెలిపారు.

# ఆర్టీసీ డిఎం పద్మావతితో పిసిడబ్ల్యూన్యూస్ జర్నలిస్ట్ మనోర స్వామి ముఖాముఖి





**తొర్రూరు ప్రతినిధి, ఏప్రిల్ 15(పిసీడబ్ల్యూ న్యూస్):** వాతావరణ శాఖ ఈ వేసవిలో వస్తున్న ఎల్ ని నో ప్రజలకు అవగాహన కల్పిస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వాతావరణ శాఖ ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 3 గంటల వరకు తప్పనిసరి అయితే తప్ప బయట తిరగరాదు అని హెచ్చరిస్తున్న నేపథ్యంలో తప్పనిసరిగా విధులకు హాజరు కావలసిన వారెందరో ఉంటారు. అందులో భాగంగా టి జి ఎస్ ఆర్ టి సి బస్సు డ్రైవర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం ఆర్టీసీ డిపో మేనేజర్ పద్మావతి తో పి సీ డబ్ల్యూ న్యూస్ జర్నలిస్ట్ మనోర స్వామి ముఖాముఖిగా కొన్ని సూచనలు తెలియపరచాలని తెలిపారు. సానుకూలంగా స్పందించిన డిఎం పద్మావతి ఆర్టీసీ డ్రైవర్లకు పలు సూచనలను అందిస్తున్నామని ఎల్ ని నో ను దృష్టిలో ఉంచుకొని డ్రైవర్లకు వేడి తగలకుండా తలకు చుట్టుకునేందుకు ఒక టవల్ ను ఏర్పాటు చేస్తున్నామని దీనితోపాటు 5 లీటర్ల వాటర్ క్యాన్ దానికి వేడి తగలకుండా గోనెసంచులతో వాటర్ బాటిల్ త్వరలో ఏర్పాటు చేసి వారికి అందజేయగలమని పేర్కొన్నారు. డిపోలో విధులు నిర్వహించే మిగతా మెకానికులకు కూడా వచ్చే వేసవిలో ఎండ తీవ్రతను తట్టుకునే విధంగా ఎలాంటి చర్యలు తీసుకోవాలో వారికి కూడా జాగ్రత్తలను పాటించే సూత్రాలను కూడా అందజేయడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. బయటకు వెళ్లి ఆర్టీసీ బస్సు డ్రైవర్ల పట్ల ఎప్పటికప్పుడు వారి యోగక్షేమాలు తెలుసుకుంటూనే ఉన్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టిఐ రజిత డ్రైవర్లు ఉన్నారు.

# డాక్టర్ కోలా ప్రతాప్‌ను సన్మానించిన క్రీడా సంఘం ప్రతినిధులు




**కర్నూలు ఏప్రిల్ 15(పిసీడబ్ల్యూ న్యూస్):** కష్టపడితే ఎంతటి వారైనా ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని అందుకు కోలా ప్రతాప్ ఉదాహరణ అని జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షులు బి. రామాంజనేయులు, జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ అండ్ విజిలెన్స్ కమిటీ సభ్యులు సురేంద్ర, జిల్లా హాకీ కార్యదర్శి దాసరి సుధీర్ అన్నారు. బుధవారం కర్నూలు డి.ఎస్.ఏ అవుట్డోర్ స్టేడియంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరాటే మాస్టర్ గానే కాకుండా అనేక కరాటే పోటీలలో క్రీడాకారుడుగా పాల్గొని పతకాలు సాధించి అనేకమంది క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని అన్నారు. అలాగే కరాటే క్రీడకు ఆయన చేసిన సేవలకు గాను దక్షిణ భారత కరాటే సంఘం అధ్యక్షుడిగా ఎన్నిక కావడం మన జిల్లాకు ఎంతో గర్వకారణం అని అన్నారు. జిల్లా ఎస్సీ ఎస్టీ మానిటింగ్ అండ్ విజిలెన్స్ కమిటీ సభ్యులు సురేంద్ర మాట్లాడుతూ కోలా ప్రతాప్ దక్షిణ భారత కరాటే సంఘం అధ్యక్షుడుగా ఎన్నికైనందుకు ముందుగా శుభాకాంక్షలు తెలియజేశారు, అనంతరం ఆయన ఎన్నో ఏళ్లగా కరాటే శిక్షణ అందిస్తూ అనేకమంది క్రీడాకారులుగా తయారుచేసి సమాజానికి అందించారని తెలిపారు. అనంతరం డాక్టర్ కోలా ప్రతాప్ ను క్రీడా సంఘాల ప్రతినిధులు, మరియు కరాటే సంఘం ప్రతినిధులు కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొండపోగు చిన్న సుంకన్న, జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, కరాటే మాస్టర్లు ప్రణీత్, విజయ్, వెంకటేష్, శివ, మహేష్, కిరణ్, ఇంద్ర, క్రీడాకారులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్షల్లో 949 మార్కులతో ప్రతిభ కనబరిచిన నాణ్యం పల్లి కుబేర యాదవ్



**తాడిమర్రి ఏప్రిల్ 15(పిసీడబ్ల్యూ న్యూస్):** ఇంటర్ పరీక్షల్లో తాడిమర్రి మండలం పత్రపల్లి గ్రామానికి చెందిన నాణ్యం పల్లి కుబేర యాదవ్ ఇంటర్ పరీక్షల్లో 949 మార్కులతో ప్రతిభ కనపరిచి తాడిమర్రి మండలంలో అత్యధిక మార్కులతో టాపర్ గా నిలిచారు. పత్రపల్లి గ్రామానికి చెందిన నాన్యంపల్లి చిన్న గంగాధర పెద్ద కుమారుడు కుబేర యాదవ్ నంద్యాల జిల్లా బేతంచర్ల సమీపంలో ప్రభుత్వ గురుకుల పాఠశాలలో ఇంటర్ ఎంపీసీ చదివారు. పదవ తరగతి బత్తలపల్లి మండలం రామాపురం గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి వరకు చదివారు. చక్కటి ప్రతిభ కనపరుస్తూ ఇంటర్ పరీక్షల్లో చక్కటి మార్కులు సాధించి తాడిమరి మండలానికి ఆదర్శంగా నిలిచారు. నా తల్లిదండ్రులు ప్రోత్సాహంతోనే ఇంటర్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించానని కుబేర యాదవ్ అన్నారు. సీఏ చేయడమే నా లక్ష్యం అని నా తల్లిదండ్రుల దీవెనలు నాకు అండగా ఉంటాయన్నారు. ఇంటర్ పరీక్షల్లో అత్యధిక మార్కులు రావడం పట్ల పత్రపల్లె గ్రామ ప్రజలు. బంధువులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# పాఠశాలల్లో మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి: ఎమ్మెల్యే కేఈ శ్యామ్ కుమార్

**● ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఆకస్మిక తనిఖీ ● విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఎమ్మెల్యే ● పరిశుభ్రత,నాణ్యతపై ప్రత్యేక దృష్టి**



**పత్తికొండ ఏప్రిల్ 15(పిసీడబ్ల్యూ న్యూస్):** పత్తికొండ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే కేఈ శ్యామ్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో హాజరైన విద్యార్థినుల సంఖ్య, వారికి మెనూ ప్రకారం భోజనం అందుతున్నదా అనే విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని హెడ్మాస్టర్‌ను ఆదేశించారు. క్రమశిక్షణతో చదువుకుంటూ, ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తే విజయాన్ని సాధించవచ్చని విద్యార్థులకు సూచించారు. ప్రతి ఒక్కరూ కష్టపడి చదవాలని ప్రోత్సహించారు. అలాగే ఉపాధ్యాయులు బోధన విధానం, భోజనం నాణ్యత, రుచి గురించి విద్యార్థులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం వంటగదిని పరిశీలించి మధ్యాహ్న భోజనం నాణ్యతను స్వయంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఎమ్మెల్యే, భోజనం రుచిగా ఉందని సంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం రుచి, శుచితో కూడిన పౌష్టికాహార భోజనం అందించాలని హెడ్మాస్టర్‌కు ఆదేశించారు.

# సిఐటియు జండా ఆవిష్కరణ



**పత్తికొండ ఏప్రిల్ 15(పిసీడబ్ల్యూ న్యూస్):** నంద్యాలలో జరిగే రాష్ట్ర మహాసభల సందర్భంగా సిఐటియు రాష్ట్ర పిలుపు మేరకు జిల్లా సిఐటియు అధిష్టానం మేరకు గురువారం పత్తికొండ పట్టణంలోని స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం దగ్గర ఉన్న సిఐటియు కార్యాలయం ముందు సిఐటియు జండా ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు రామాంజనేయులు అధ్యక్షతన వహించగా సిఐటియు మండల అధ్యక్షులు డి గోపాల్ జండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సిఐటియు మండల కార్యదర్శి ఎం రవిచంద్ర మాట్లాడుతూ ఈనెల 17 18 19 తేదీల్లో నంద్యాల నందు సిఐటియు రాష్ట్ర మహాసభలో జరుగుతున్నాయని అందుకు కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని అన్నారు కేంద్ర ప్రభుత్వం కార్మికులపై విధించిన నాలుగు లేబర్ కోడ్లును వెంటనే రద్దుచేసి 29 పాత చట్టాలను పునరుద్ధరించాలని ఆయన అన్నారు కార్మికులు కర్షకులు కార్మిక ఉద్యమకారులు రాజ్యాధికారం చేపడితే తప్ప కార్మికులకు మంచి రోజులు రావని బడుగు బలహీన వర్గాలు కార్మికులు కర్సికులు స్కీం వర్కర్లు ఈ ప్రభుత్వాలలో వెట్టిచాకిరికి గురవుతున్నారని ఆయన అన్నారు.